RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 22 జూలై 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:46

# ఢిల్లీలో హైటెన్షన్..



**ప్రధాని ఇంటి ముందు రాహుల్, ప్రియాంక ధర్నా**
**పార్లమెంట్ నుంచి ప్రధాని ఇంటికి పాదయాత్రగా వెళ్లిన కాంగ్రెస్ నేతలు**
**ప్రధాని నివాసం ముట్టడికి యత్నం**
**అడ్డుకున్న పోలీసులు**
**ప్రధాని నివాసం ముందు బైఠాయించిన కాంగ్రెస్ అగ్రనేతలు**
**నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో మోదీ, షా, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్**

నీట్ పేపర్ లీక్ వ్యవహారం, విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ మంగళవారం ప్రధాని నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పవన్ ఖేరా, కేసీ వేణుగోపాల్, దీపేందర్ హుడా, డీకే శివకుమార్, రాజా వారింగ్‌తో పాటు పలువురు నేతలు పాదయాత్రగా ప్రధాని నివాసం లోక్ కల్యాణ్ మార్గ్ వైపు వెళ్లారు. దీంతో అక్కడ భారీగా పోలీసులను మోహరించి వారిని అడ్డుకున్నారు.

పోలీసులు అడ్డుకోవడంతో కాంగ్రెస్ నేతలు అక్కడే ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతమంది కాంగ్రెస్ ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండానే ర్యాలీ చేపట్టారని పోలీసులు చెబుతుండగా, ప్రజాస్వామ్య హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఈ ధర్నాలో నేతలు ప్లాస్టిక్ ట్యాగ్ లతో చేతులను కట్టేసుకొని నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. విద్యార్థులపై జరిగిన దాడికి ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని, యువత భవిష్యత్తును నాశనం చేసినందుకు మోదీ, హోంమంత్రి అమిత్ షా, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా లేదని, తమ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తప్పించుకుంటోందని ఆరోపించారు. అలాగే సోమవారం ఆందోళనలో గాయపడిన విద్యార్థులను రాహుల్, ప్రియాంక గాంధీ ఆర్ఎంఎల్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

## ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా..
## రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



2 లో



ప్రధాని నరేంద్ర మోదీ ఇంటీ ముందు ధర్నా నిర్వహించిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మరియు కాంగ్రెస్‌నాయకులను అరెస్ట్ చేసి మందిర్‌మార్గ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినారు. మందిర్ మార్గ్ పోలీస్‌స్టేషన్‌కు సీపీపీ చేర్‌పర్సన్ సోనియాగాంధీ చేరుకుని ప్రియాంకగాంధీ మరియు కాంగ్రెస్ నాయకులను కలిసి పరామర్శించినారు.

## హకీంపేటలో ఎడ్యుకేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలి రేవంత్ రెడ్డి



వికారాబాద్ జిల్లా హకీంపేటలో ఎడ్యుకేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటినుంచి ప్రతి నెలా పనుల పురోగతిని తనిఖీ చేస్తానని చెప్పారు.

ముఖ్యమంత్రి ఎడ్యుకేషన్ హబ్‌కు సంబంధించి ఆయా విద్యా సంస్థల భవన నిర్మాణాలను, ఆ ప్రాంత అభివృద్ధి ప్రణాళికలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో భాగంగా నిర్మిస్తున్న ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ కాలేజీలు, ఫిజియో థెరఫీ -- పారా మెడికల్ కాలేజీలు, సంబంధిత హాస్టళ్ల నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

నిర్మాణ పనులు నెమ్మదిగా సాగడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి నెలవారీ పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతీ నెలా పనుల పురోగతిపై తనిఖీ చేయడమే కాకుండా ఒక రోజు సైట్‌లోనే బస చేస్తానని చెప్పారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అలాంటి వారిని సస్పెండ్ చేయడానికి వెనుకాడొద్దని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యం జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే వారంలోగా ప్లాట్ల పట్టాలు లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

## రాహుల్ గాంధీ అరెస్ట్ నియంతృత్వ ధోరణికి పరాకాష్ట..

### టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్.



ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ని ఎంపీ ప్రియాంక గాంధీ తో పాటు ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చెసి జైల్ కు తరలించడం దుర్మార్గం.. మోడీ ఇంటి ముందు ధర్నా చేసి నీట్ పరీక్ష పేపర్ లీక్ ల విషయంలో పార్లమెంట్ లో సమగ్ర చేయాలన్న రాహుల్ గాంధీ డిమాండ్ కు బీజేపీ సర్కార్ భయపడింది...

అడ్డగోలుగా అవినీతి అక్రమాలకు పాల్పడి విచారణ చేయమంటే, చర్చలు చేయమంటే బీజేపీ తోక ముడుస్తుంది..

రాహుల్ గాంధీ తోపాటు ప్రతిపక్ష నేతలు అరెస్ట్ లకు నిరసనగా రేపు చలో రాజ్ భవన్..

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్..

రేపు ఉదయం 11 గంటలకు చలో రాజ్ భవన్ (లోక్ భవన్) కు కాంగ్రెస్ శ్రేణులు నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్దకు పెద్ద ఎత్తున తరలిరావాలి...

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్స్ లు, పార్టీ నాయకులు అందరూ భారీగా తరలివచ్చి బీజేపీ నిరంకుశ పాలనపై ఉద్యమించాలి.. మహేష్ కుమార్ గౌడ్. .

## ఎల్‌నీనో ప్రభావం కారణంగా ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతంగణనీయంగాతగ్గేఅవకాశం ఉంది. పొంగులేటిశ్రీనివాస్ రెడ్డి




వార్తా 2 లో



ఢిల్లీలో మల్లికార్జున్‌ఖార్గే కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణా కాంగ్రెస్ పార్టీ ఎంపీలు వేము నరేందర్‌రెడ్డి ,మల్లురవి,సురేష్‌షట్కార్ ,బల్‌రాంనాయక్ , చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాబలం

22 జూలై 2026 బుధవారం

## ప్రైవేట్ వర్శిటీలపై తలంటిన సుప్రీం

పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్న ప్రైవేట్ యూనివర్సిటీల వెనుక ఉన్న అసలు ఉద్దేశాలు.. వాటిని ఏర్పాటు చేస్తున్న సంస్థలు/ వ్యక్తుల అసలు లక్ష్యాలు ఏమిటి..? ఆ యూనివర్సిటీల్లో బోధిస్తున్న వారికి ఉన్న విద్యార్హతలు ఏమిటి అనే దానిపై సర్వోన్నత న్యాయస్థానం దృష్టి సారించింది. అయేషా జైన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణలో తన దృష్టికి వచ్చిన అనేక ఫిర్యాదులను పరిశీలించిన సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ప్రైవేట్ యూనివర్సిటీల్లో తనిఖీలకు ఆదేశించింది. ప్రైవేట్ యూనివర్సిటీలు ఏకపక్షంగా వ్యవహరిస్తుండడంతో అసలు వాటి ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాలు మొదలు వాటిలో అందుతున్న విద్యా ప్రమాణాల స్థాయి వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పూర్తి వివరాలతో అఫిడవిట్లు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ యూనివర్సిటీల్లో తనిఖీల కోసం కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీలో కన్వీనర్‌గా తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి, సభ్య కన్వీనర్‌గా జేఎన్‌టీయూ రిజిస్ట్రార్, సభ్యులుగా పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ విద్యా కమిషనర్ అసిస్టెంట్ డైరెక్టర్ (అకడమిక్–సి)లను నియమించింది. అవసరమైతే ఒక సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ను నియమించుకునే అవకాశం కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈ కమిటీ రాష్ట్రంలోని ప్రతి ప్రైవేట్ యూనివర్సిటీని సందర్శించి క్షుణ్ణంగా తనిఖీలు చేస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశించిన 9 అంశాలపై ఈ కమిటీ తనిఖీలు చేపడుతోంది.ప్రైవేట్ యూనివర్సిటీలకు సంబంధించి 9 అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు వివరణ కోరిన అంశాలు? అసలు యూనివర్సిటీ ఎందుకు ఏర్పాటు చేశారు. దాని ఏర్పాటుకు కారణాలు, ఉద్దేశాలు ఏమిటి? యూనివర్సిటీ ఏర్పాటుకు ముందు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేశారా? స్థాపనకు ముందు ఏమైనా విధానపరమైన పరిశీలన (పాలసీ కన్సిడరేషన్) చేశారా? లేదా? యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా భూ కేటాయింపు చేసిందా? యూనివర్సిటీకి కల్పించిన ఇతర ప్రయోజనాలు.. అందుకు విధించిన నిబంధనలు, షరతులు ఏమిటి? యూనివర్సిటీని వాస్తవంగా నిర్వహిస్తున్న సొసైటీ, సంస్థ, వ్యక్తి ధ్యేయం ఏమిటి?. యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలో ఉన్న సభ్యులు ఎవరు? ఆ సభ్యులను ఎలా ఎంపిక చేశారు. యూనివర్సిటీని వాస్తవంగా నిర్వహిస్తున్న వ్యక్తి, మేనేజ్‌మెంట్ కమిటీలో సభ్యుల సమగ్ర వివరాలు. విద్యార్థులు యూనివర్సిటీలో చేరడానికి ఏ విధానం అవలంభిస్తున్నారు. ఎంట్రన్స్‌కు సంబంధించిన ప్రమాణాలు, నిబంధనలు, ఆ నిబంధనలు చట్టానికి అనుగుణంగా ఉన్నాయా? లేదా?.. ఎంట్రన్స్‌కు సంబంధించిన విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించిందా? ధ్రువీకరించిందా?బోధనా సిబ్బందిని (అకడమిక్ స్టాఫ్) యూనివర్సిటీ ఎలా నియమించింది. వారి ఎంపికను ఏ కమిటీ చేపట్టింది. సిబ్బంది నియామకం యూజీసీ నిబంధనలకు లోబడే చేపట్టారా? ఆ నియామక ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించిందా..?రాష్ట్రంలో ఇతర విద్యా సంస్థలు, యూనివర్సిటీలకు విధించిన నిబంధనలు, షరతులను ఈ యూనివర్సిటీలు కచ్చితంగా పాటిస్తున్నాయని నిర్ధరించడానికి ప్రభుత్వం తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేసిందా? చేస్తే ఆ బృందం తనిఖీలు (ఇన్‌స్పెక్షన్లు) నిర్వహిస్తుందా? తరచూ తనిఖీలు చేస్తున్నాందా? నిబంధనల అమలును తనిఖీ బృందం పర్యవేక్షిస్తుందా? ఏవైనా నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారా? నిబంధనలు ఉల్లంఘిస్తే ఏమైనా చర్యలు తీసుకున్నారా? ప్రభుత్వం తరఫు నుంచి ఏవైనా మినహాయింపులు ఇచ్చారా?'లాభాపేక్ష లేని, నష్టం లేని' (నో ప్రాఫిట్, నో లాస్) ప్రాతిపదికన పని చేస్తున్నామని ప్రకటించుకున్న యూనివర్సిటీలు నిజంగా అలానే పని చేస్తున్నాయా? ప్రభుత్వం దానిని ఏ అధికారంతో అనుమతించింది. యూనివర్సిటీ ఏర్పాటు చేసిన వారు, ఆయన కుటుంబ సభ్యులకు చెల్లించే వేతనాలు, ఇతర ఖర్చులు, సంపాదించిన ఆస్తులతో సహా ఇతర అంశాలకు యూనివర్సిటీల నిధులు మళ్లించలేదని ఎలా నిర్ధారించారు? ఆయా యూనివర్సిటీల ఖాతాలను ఖాతాలను ఆడిట్ చేశారా? నిధుల మళ్లింపుపై ఏవైనా పరిశీలన చేశారా? యూనివర్సిటీ ఏర్పాటు చేసిన వ్యక్తి, ఆయన కుటుంబ సభ్యులకు చేసిన చెల్లింపులను నిశితంగా పరిశీలించారా? యూనివర్సిటీ ఏర్పాటు చేసిన వారు, ఆయన కుటుంబ సభ్యులు సంపాదించిన ఆస్తులను పరిశీలించారా? ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారా? గుర్తిస్తే తీసుకున్న చర్యలు ఏమిటి?విద్యార్థులతో పాటు బోధనా సిబ్బంది ఫిర్యాదుల పరిష్కారానికి ఏదైనా వ్యవస్థ సదరు యూనివర్సిటీలో ఉందా? ఉంటే అవి పని చేస్తున్నాయా? ఫిర్యాదుల పరిష్కార కమిటీల కూర్పు ఎలా ఉంది. అప్పీలేట్ చేసుకునే అవకాశం ఉందా? ఇప్పటి వకు ఏవైనా ఫిర్యాదులు అందాయా? అందితే వాటిని పరిష్కరించారా.? యూనివర్సిటీలు చట్టప్రకారం నిర్దేశించిన కనీస వేతనాలను అకడమిక్ స్టాఫ్‌కు చెల్లిస్తున్నాయా? యూజీసీ నిబంధనల అమలును ధ్రువీకరించారా? సిబ్బంది వేతనాల రికార్డులను పరిశీలించారా? ఈ క్రమంలో ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన గుర్తించారా? అలా గుర్తిస్తే ఏమైనా చర్య తీసుకున్నారా?సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తనిఖీ బృందం రాష్ట్రంలోని ప్రైవేట్ యూనివర్సిటీల్లో ఆయా అంశాలను తనిఖీ చేసి ఆ వివరాలతో సమగ్ర అఫిడవిట్ రూపొందిస్తోంది. ఆ అఫిడవిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించనుంది. అఫిడవిట్ సమర్పణ అనంతరం సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తదుపరి కార్యాచరణ చేపట్టనుంది. అలాగే తనిఖీ బృందం ఈ 9 అంశాలతో పాటు సంబంధిత ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక రూపొందించనుంది.

## ఎల్‌నీనో ప్రభావం కారణంగా ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతంగణనీయంగాతగ్గేఅవకాశం ఉంది. పొంగులేటిశ్రీనివాస్ రెడ్డి

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూలై 21** శంలోని అనేక రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావ ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉంది.

మూడు రోజుల క్రితం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు. వర్షాభావ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

ఆయా జిల్లాల్లో వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులు తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రివర్గానికి అందజేస్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను ప్రత్యేక అధికారిగా నియమించారు.

వర్షాభావ పరిస్థితుల నుంచి జిల్లాలను ఎలా గట్టెక్కించాలి, రైతులకు ఎలాంటి భరోసా కల్పించాలి, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. వర్షాభావ పరిస్థితులపై సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి, రాష్ట్రానికి అందాల్సిన సహాయం, కేంద్రం నుంచి పొందాల్సిన మద్దతుపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి స్పష్టం చేశారు.

## ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా.. రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

### నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన
### రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
### విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు
### అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్
### ఢిల్లీలో కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తత







నీట్ పరీక్షల వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారితీశాయి. ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద తీవ్ర హైడ్రామా చోటుచేసుకుంది. నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటులో చర్చకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమైన అనంతరం రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా వంటి సీనియర్ నేతల నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరారు. అయితే, వారిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసన స్థలానికి చేరుకుని రాహుల్ గాంధీతో మాట్లాడారు. పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అయితే, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి. చర్చలు కొలిక్కి రాకపోవడంతో, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సహా భారీగా మోహరించిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నిరసనకారులను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, రణ్‌దీప్ సూర్జేవాలా, కె. సురేశ్, చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా నిరసన స్థలానికి వచ్చి కాంగ్రెస్ నేతలకు మద్దతు తెలిపారు. నీట్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిపై విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మరోవైపు, ప్రధాని నివాసం వంటి అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతంలో నిరసనలు చేపట్టడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమేనని అధికార పక్షం విమర్శిస్తోంది. ఈ ఘటనతో నీట్ వివాదం మరింత వేడెక్కింది.

## మహిళల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత

చిట్వేలి మహిళల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని రైల్వే కోడూరు పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సి. చంద్ర శేఖర్ అన్నారు. మంగళవారం రైల్వే కోడూర్ మండల రెవిన్యూ అధికారి కార్యాలయం ఆవరణలో మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఎలాంటి వేధింపులు, బెదిరింపులు, గృహ హింస, లైంగిక వేధింపులు, ఇతర నేరాలకు గురైన వెంటనే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రతి మహిళ తన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, చట్టం మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పిస్తుందని తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించరాదని హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ మాధ్యమాల్లో ఫోటోలు, వీడియోలు, వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వినియోగం ఆరోగ్యాన్ని, విద్యను, కుటుంబ జీవితాన్ని మరియు భవిష్యత్తును నాశనం చేస్తుందని తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహిళలు ప్రయాణాల సమయంలో భద్రతా జాగ్రత్తలు పాటించాలని, రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే సందర్భాల్లో కుటుంబ సభ్యులకు తమ ప్రయాణ వివరాలు తెలియజేయడం, వాహనం నంబర్‌ను నమోదు చేసుకోవడం, అవసరమైతే లైవ్ లొకేషన్‌ను షేర్ చేయడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112 పోలీస్ ఎమర్జెన్సీ సర్వీస్, 181 మహిళల హెల్ప్‌లైన్, 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు మండల రెవిన్యూ అధికారి అమర్నాథ్, వెలుగు ఏపిఎం వసుందర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలా దేవి, కోడూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ సంధ్య, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో ఘనంగా టి.జే.ఏ. 12వ ఆవిర్భావ దినోత్సవం

## - శనిగపురం వృద్ధ అనాథాశ్రమంలో అన్నదానం -- పండ్ల పంపిణీ నిర్వహించిన జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్

**మహబూబాబాద్, ప్రతినిధి (జూలై 21) ప్రజాబలం న్యూస్:** తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టి.జే.ఏ.) 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా శనిగపురంలోని వృద్ధ అనాథాశ్రమంలో మానవతా సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ ఆధ్వర్యంలో ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేసి, పండ్లను పంపిణీ చేశారు. అనంతరం వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ఆప్యాయంగా పరామర్శించారు.




ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ మాట్లాడుతూ, సమాజ సేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జర్నలిస్టులు ప్రజలకు వార్తలు అందించడమే కాకుండా సమాజం పట్ల తమ బాధ్యతను సేవా కార్యక్రమాల ద్వారా చాటాలని పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సంఘం ఆశయాలకు ప్రతీక అని తెలిపారు.ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ, వృద్ధుల పట్ల చూపిన మానవతా దృక్పథానికి టి.జే.ఏ. సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని అభినందించారు.




ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌తో పాటు టి.జే.ఏ. సభ్యులు, జర్నలిస్టులు పాల్గొని వృద్ధులకు స్వయంగా భోజనం వడ్డించి, పండ్లు పంపిణీ చేశారు. సేవాభావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది. వృద్ధుల ముఖాల్లో కనిపించిన ఆనందం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమాజ సేవే నిజమైన మానవత్వమనే సందేశాన్ని టి.జే.ఏ. మరోసారి చాటిచెప్పింది.

# ముందస్తు చర్యలతోనే ప్రకృతి విపత్తుల నష్టం తగ్గింపు

## తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 21:** ప్రకృతి వైపరీత్యాలను అరికట్టడం సాధ్యం కాకపోయినా, ముందస్తు ప్రణాళికలు, నివారణ చర్యలతో వాటి వల్ల కలిగే నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఎల్‌నీనో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, మండల, జిల్లా స్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సవ్యసాచి ఘోష్, వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులతో కలిసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు.

స్పీకర్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా ఉలవ, పెసర, కంది, మినుములు, వేరుశనగ వంటి తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు అధిక దిగుబడి ఇచ్చే పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే ఉద్యాన పంటలు, పండ్ల తోటలు,




పూల సాగు, డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని అన్నారు.

జలసిరితో నీటి సంరక్షణకు ప్రాధాన్యంలి భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని స్పీకర్ సూచించారు. వ్యవసాయ భూముల్లో నీటి గుంటలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని నిల్వ చేయడం, నీటి వృథాను నివారించడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించాలని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌లలో లీకేజీలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, తక్కువ వర్షపాతం నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యాన పంటలు, పండ్ల తోటలు, పూల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖలు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

సమావేశంలో వివిధ శాఖల అధికారులు ఎల్‌నీనో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన యాక్షన్ ప్లాన్‌లు, కంటింజెన్సీ ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్థం కానీ వైసీపీ స్టాండ్...

విజయవాడ, జూలై 21 దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యల మీద ఎంపీలు వాయిదా తీర్మానం ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. పైగా ఇప్పుడు పార్లమెంట్లో వర్షాకాల సమావేశాలు కూడా మొదలయ్యాయి. ప్రజలు ఎన్నుకున్న పార్లమెంట్ సభ్యులు ప్రజల సమస్యల మీద తమ వాయిస్ వినిపించవచ్చు. ప్రజల బాధలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లొచ్చు. కానీ ఈ విషయంలో వైసిపి వేరే ఆలోచన చేస్తోంది.వైసిపికి ఏపీలో 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలు మాత్రమే వచ్చాయి. కనీసం ప్రతిపక్ష హోదాను కూడా అక్కడ ప్రజలు ఇవ్వలేదు. ప్రతిపక్ష హోదా కోసం జగన్ అనేక సందర్భాల్లో దేబిరించారు. అయినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. చివరికి తాను అసెంబ్లీకి వెళ్లడమే మానేశారు. ప్రభుత్వాన్ని నిలదీసే అధికారం ఉన్నప్పటికీ.. ఎందుకనో జగన్ ఆ అవకాశాన్ని వినియోగించుకోలేకపోయారు. 2019 నుంచి 23 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్.. ప్రతిపక్ష టీడీపీకి ఇబ్బందికరమైన వాతావరణం కలిగించారు. కనీసం అసెంబ్లీలో మాట్లాడే స్వేచ్ఛను కూడా ఇవ్వలేకపోయారు. కర్మ రిటర్న్స్ అన్నట్టుగా.. జగన్ కు 11 స్థానాలు రావడంతో కనీసం ప్రతిపక్ష హోదాను కూడా సొంతం చేసుకోలేకపోయారుఏపీలో అసెంబ్లీకి కూడా వెళ్ళని వైసీపీ నేతలు.. పార్లమెంట్లో మాత్రం శాంతి భద్రతల మీద వాయిదా తీర్మానం ఇవ్వడం ఆశ్చర్యంగా ఉంది. వైసీపీ ఎంపీ గురుమూర్తి పార్లమెంటులో ఈ తీర్మానాన్ని ఇచ్చారు. పార్లమెంట్ రూల్ ఆఫ్ బుక్ గురించి అవగాహన ఉన్న ఎవరికైనా సరే ఈ తీర్మానం గురించి వెంటనే ఒక క్లారిటీ వస్తుంది. ఎందుకంటే ఈ తీర్మానం మొదటి క్షణంలోనే విరిగిపోతూ ఉంటుంది. అయినప్పటికీ తాము ఢిల్లీ స్థాయిలో పోరాడుతున్నామని వైసీపీ నేతలు చెప్పడానికి అవకాశం ఉంటుంది. సొంత ఛానల్లో డబ్బాలు కొట్టుకోవడానికి సందర్భం ఉంటుంది.

ఇక్కడ వైసిపి నేతలకు తెలియంది ఏంటంటే.. శాంతిభద్రతల వ్యవహారం పూర్తిగా రాష్ట్రాల పరిధిలో ఉంటుంది.

భారత రాజ్యాంగం కూడా ఇదే చెబుతోంది. శాంతిభద్రతలను గురించి చర్చించడానికి.. ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడానికి అక్కడి ప్రజాప్రతినిధులు ఉంటారు. ఒకవేళ శాంతి భద్రతల విషయంలో ఇబ్బందులు ఎదురవుతుంటే బాధ్యతాయుతమైన ప్రతిపక్షం ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీయాలి.. ఆధారాలతో సహా కడిగిపారేయాలి. ఆ దమ్ము లేని వైసిపి అసెంబ్లీకి రావడం లేదు. ఏదో గుంపులో గోవిందం లాగా శాంతిభద్రతల వ్యవహారం మీద పార్లమెంట్లో తీర్మానం ఇచ్చింది.ఏపీ అసెంబ్లీలో 11మంది మాత్రమే ఉన్నారు కాబట్టి వైసిపి నేతలకు మైక్ దొరికే అవకాశం లేదు. ఒకవేళ దొరికితే మాట్లాడే దమ్ము వారి దగ్గర లేదు. ఒకవేళ మాట్లాడినా కూటమి ఎమ్మెల్యేలు లెక్కలతో సహా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. అందువల్లే వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లడం లేదు. అసెంబ్లీ గేటు కూడా తాగేందుకు వైసిపి నేతలు ఇష్టాన్ని చూపించడం లేదు. అందువల్లే ఢిల్లీలో వాయిదాల పేరుతో హల్చల్ చేస్తున్నారు.

ఇటువంటి వీరికి డెమోక్రసీ గురించి.. పార్లమెంటు గురించి ఎంత స్థాయిలో చిత్తశుద్ధివంతో తెలుసుకోవచ్చు. మరోవైపు వైసీపీ వాయిదా తీర్మానాన్ని స్పీకర్ రెండు సెకండ్ల కంటే ఎక్కువ చదవరు. పైగా దానిని చెత్తబుట్టలో పడేస్తారు.. అసెంబ్లీకి వెళ్లకుండా.. పార్లమెంట్లో ఈ డ్రామాలు ఆడితే ప్రజలకు తెలియదా. ప్రజలు అంత అమాయకులా.. సొంత ఛానల్లో హెడ్లైన్స్ వేసినంతమాత్రాన ప్రజలు అంత ఈజీగా నమ్ముతారా

# అతివేగంగా, పెద్ద శబ్దాలతో వాహనాలు నడుపు ప్రజలను ఇబ్బందులు పెడితే సహించం

## .- యువత ఆదర్శంగా ఉంటూ ప్రమాదాలకు దూరంగా ఉండాలి....

## సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ

.కోదాడ టౌన్: నిబంధనలకు విరుద్ధంగా బైక్‌ల సైలెన్సర్లు మార్చి, అధిక శబ్దాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వాహనదారులపై కోదాడ పట్టణ, కోదాడ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. సైలెన్సర్ లు మార్చి అధిక శబ్దంతో పట్టణంలో ఇష్టారాజ్యంగా తిరుగుతున్న వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవడం కోసం స్పెషల్ నిర్వహించారని ఎస్పి నరసింహ తెలిపినారు, ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా సీజ్ చేసిన 40 మోడిఫైడ్ సైలెన్సర్లను మంగళవారం పోలీసులు రోడ్డు రోలర్‌తో తొ?క్కించి ధ్వంసం చేశారు. కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తాలో జిల్లా ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. మితిమీరిన శబ్దాలు చేస్తూ ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు, రోగులు, చిన్న పిల్లలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు కంపెనీ సైలెన్సర్లను మాత్రమే వాడాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. పట్టణంలో ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని ఎస్పీ తెలిపారు. యువత ఆదర్శంగా ఉండాలి రోడ్డు ప్రమాదాలకు గురి కావద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్స్పెక్టర్ శివ శంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగస్టు 30లోగా అన్ని గురుకుల విద్యాసంస్థల తనిఖీలు పూర్తి చేయాలి

## ప్రతి ఆర్సీవో వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడలు, కళల్లోనూ ప్రతిభను పెంపొందించాలి

## సంక్షేమ గురుకుల విద్యాసంస్థల రీజినల్ కోఆర్డినేటింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి పొన్నందిశా నిర్దేశం

హైదరాబాద్ మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (ఓఏఖుఃఅచిఖీఇమొ) పరిధిలోని అన్ని గురుకుల విద్యాసంస్థలను ఈ ఏడాది ఆగస్టు 30లోగా పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, సురక్షిత వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం . బీసీ గురుకుల విద్యాసంస్థల నిర్వహణ, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, విద్యార్థుల సంక్షేమంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

గురుకుల విద్యాసంస్థల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వాతావరణాన్ని కల్పించేలా అధికారులు పనిచేయాలని,ప్రతి రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ (ఖీఅూ) వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కనీసం ఆరు గురుకుల విద్యాసంస్థలను సందర్శించాలని ఆదేశించారుర.ఆర్సీవోలు కేవలం పర్యవేక్షణకే పరిమితం కాకుండా ప్రధాన కార్యాలయం, జిల్లా యంత్రాంగం, విద్యాసంస్థల మధ్య సమన్వయం కల్పించే సంధాన కర్తలుగా వ్యవహరించాలని సూచించడం జరిగింది. సొంత భవనాలు లేని గురుకుల విద్యాసంస్థలకు భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకోసం సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమావేశమై అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

అలాగే, ఏ నియోజకవర్గానికి అనుమతి పొందిన విద్యాసంస్థ అదే నియోజకవర్గ పరిధిలో భవనాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించి. అద్దె భవనాలకు చెల్లించే మొత్తంలో ఆరు శాతం నిధులను భవనాల మరమ్మతులకు తప్పనిసరిగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసారు.

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి విద్యాసంస్థలో రెయిన్వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను సమర్థవంతంగా అమలు చేసి భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించడం జరిగింది . తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులు, సూచనలు, సలహాలను ఎప్పటికప్పుడు ప్రధాన కార్యాలయానికి తెలియజేసి వాటిపై సత్వర చర్యలు తీసుకోవాలని. విద్యార్థులకు పాఠ్యాంశాల్లోనే కాకుండా క్రీడలు, కళలు, వ్యక్తిత్వ వికాసం వంటి రంగాల్లోనూ ప్రోత్సాహం అందించి సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించి,ప్రతిభ గల విద్యార్థుల వివరాలు తెలియజేస్తే వారికి ప్రభుత్వం తరపున మరింత ప్రోత్సాహం అందిస్తామని తెలిసారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా సైకాలజిస్ట్ లతో అవగాహన సమావేశాలు నిర్వహించాలని ఆయన సూచించి,విద్యార్థులు శారీరక, మానసిక ఆరోగ్యంతో ఉండేలా చర్యలు తీసుకోవాలని . ఈ విద్యా సంవత్సరంలో ఎక్కడా ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు జరగకుండా వంటశాలలు, ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి నెల కనీసం 15 గురుకుల విద్యాసంస్థలను తాను, కమిషనర్, కార్యదర్శి అకస్మిక తనిఖీలు చేస్తామని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని హెచ్చరించడం జరిగింది .మూసీ గురుకుల విద్యాసంస్థకు సొంత భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని వెల్లడించడం జరిగింది . విద్యార్థులతో విస్తృతంగా మొక్కలు నాటించి వాటి సంరక్షణ బాధ్యతను కూడా వారికి అప్పగించాలని సూచించారు.

# అటవీ భూముల్లో తండావాసుల వ్యవసాయం

గుంటూరు, జూలై 21, అటవీ శాఖకు చెందిన భూములను కొందరు ఆక్రమించి, ఆ స్థలాల్లో బోర్లు వేశారు. వ్యవసాయానికి అనుకూలంగా ఉండటంతో పంటలు కూడా పండిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని బోర్లను పూడ్చేశారు. విషయం తెలుసుకున్న తండా వాసులు అక్కడికి చేరుకుని సిబ్బందిని నిర్బంధించి, వారి వాహనాల టైర్లలో గాలి తీసేశారు. అటవీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన మాచర్ల పరిధిలో చోటుచేసుకుంది.అటవీ చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. అటవీ భూములను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉండటంతో అవి అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు అధికారులు కూడా అదే స్థాయిలో పనిచేస్తుంటారు. అయితే, కొందరు అటవీ శాఖ భూముల్లో బోర్లు వేసి వాటిని ఆక్రమించే ప్రయత్నం చేయగా.. విషయం తెలుసుకున్న అధికారులు వాటిని పూడ్చేందుకు వెళ్లారు. అది తెలుసుకున్న తండా వాసులు బైక్‌లపై గ్యాంగ్‌ల వచ్చి అటవీశాఖ అధికారులపైనే దాడికి దిగారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా మాచర్లలో చోటుచేసుకుంది.అటవీశాఖ రేంజర్ విజయలక్ష్మి కథనం మేరకు.. మారచర్ల మండలం కండ్లకుంట బీట్ పరిధిలోని రేగులవరం తండాకు చెందిన కొందరు అటవీ భూమిలో బోరు వేసి, పంటలు పండిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు రావడంతో మూడు వాహనాల్లో రేంజర్ విజయలక్ష్మితో పాటు 12 మంది సిబ్బంది తండాకు వెళ్లారు. రవి నాయక్ అనే వ్యక్తి అనుమతులు లేకుండా బోరు తవ్వినట్లు గుర్తించి, అధికారులు పూడ్చేశారు.అయితే, ఆ ప్రదేశంలో ఇంకా బోర్లు వేశారన్న సమాచారంతో మరో చోట పరిశీలించేందుక అధికారులు బయల్దేరారు. అదే సమయంలో తండాకు చెందిన కొందరు బైకులపై వచ్చి అటవీశాఖ సిబ్బంది వాహనాలను అడ్డుకున్నారు. టైర్లలోని గాలి తీసి వాగ్వాదానికి దిగారు. అడ్డుకున్న సిబ్బందిపై కొందరు దాడికి కూడా పాల్పడ్డారు. ఏకంగా మూడు గంటల పాటు వారిని అక్కడ నుంచి కదలనివ్వని పరిస్థితి.తమపై దాడి చేసి, తమను అడ్డుకున్నారంటూ అటవీ శాఖ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో విజయపురి సౌత్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, తండా వాసులను చెదరగొట్టి అటవీ శాఖ సిబ్బందిని క్షేమంగా తీసుకొచ్చారు. అయితే, తాము సాగు చేసుకుంటున్న భూములను అటవీ శాఖ సిబ్బంది స్వాధీనం చేసుకుంటున్నారు అంటూ తండావాసులు ఆందోళనకు దిగారు. మాచర్ల లోని అటవీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టడంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణ ఏర్పడింది. దాంతో మాచర్ల పోలీసులు రంగంలోకి దిగి తండా వాసులకు సర్ది చెప్పి అక్కడ నుంచి పంపించారు.

# జెత్వానీ కేసు...

## అధికారులకు ఓ లెసన్...

## అడ్డంగా దొరికిపోయిన అధికారులు

విజయవాడ, జూలై 21, ముంబై నటి కాదంబరి జెత్వానీ ఉదంతంలో సీఐడీ దాఖలు చేసిన తాజా చార్జిషీట్ వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయ, అధికార వర్గాల్లో తీవ్ర సంచలనం రేపుతోంది. గతంలో సాంకేతిక లోపాలతో న్యాయస్థానం తిరస్కరించిన పాత చార్జిషీటును పక్కనబెట్టి, ఈసారి మరిన్ని పక్కా ఆధారాలతో సీఐడీ సరికొత్త చార్జిషీటును న్యాయస్థానం ముందు ఉంచింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన బ్లాక్‌మెయిల్ ఫిర్యాదు ఆధారంగానే ఈ చార్జిషీటు దాఖలైంది. జెత్వానీ తనను ఫొటోలతో బ్లాక్‌మెయిల్ చేసి దాదాపు రూ. 1.32 కోట్ల మేర వసూలు చేసిందని విద్యాసాగర్ పోలీసులను ఆశ్రయించారు. అయితే, ఇక్కడ అసలు ట్విస్ట్ వారి మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు కావు. ఒకవేళ ఆమె ట్రాప్ చేసిందా లేక విద్యాసాగరే ఆమెను లొంగదీసుకోవడానికి డబ్బులు ఇచ్చాడా అనేది వారిద్దరి వ్యక్తిగత వ్యవహారం. కానీ, ఈ కేసు ద్వారా బహిర్గతమైన అత్యంత భయంకరమైన నిజం ఏమిటంటే..అధికార పార్టీ నేత కోసం చట్టాన్ని రక్షించాల్సిన పోలీసు వ్యవస్థే ఒక మాఫియా లాగా మారిపోవడం! బాధిత నటి దగ్గర ఉన్న కీలకమైన డిజిటల్ ఆధారాలు, ఫోటోలు, చాటింగ్‌లను పూర్తిగా తుడిచిపెట్టేయడమే లక్ష్యంగా ఈ భారీ వ్యూహం పడినట్లు విచారణలో స్పష్టమవుతోంది. విద్యాసాగర్ తన ప్రైవేటు వ్యవహారాలు బయటపడకుండా కాపాడుకోవడం కోసం పోలీసు యంత్రాంగాన్ని ఒక ప్రైవేట్ సైన్యంలా వాడుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారుల స్థాయిలోనే ఇందుకు సంబంధించిన రహస్య తప్పిదాలు జరిగాయి. ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా, కనీస నిబంధనలను బేఖాతరు చేస్తూ ముంబై వెళ్లిన ఏపీ పోలీసులు.. ఆమెను, ఆమె వృద్ధులైన తల్లిదండ్రులను కిడ్నాప్ తరహాలోనే అదుపులోకి తీసుకుని విజయవాడ తరలించారు. ఆపై రోజులకు రోజులు చట్టవిరుద్ధంగా నిర్బంధించి, తీవ్రంగా శారీరక, మానసిక హింసకు గురిచేశారనే ఆరోపణలు ఖాకీల వ్యవస్థీకృత తప్పిదాలను బట్టబయలు చేశాయి. ఒక ప్రైవేట్ వ్యక్తి ప్రయోజనాల కోసం, తప్పుడు ఫిర్యాదులను సాకుగా చూపిస్తూ ఒక మహిళ పట్ల పోలీసులు ప్రదర్శించిన ఈ క్రూరమైన అత్యుత్సాహాన్ని చట్టం ఏమాత్రం క్షమించలేదు. నిందితులు ఎంతటి నేరస్థులైనా సరే, వారిని విచారించడానికి రాజ్యాంగం కొన్ని పద్ధతులను, నిబంధనలను నిర్దేశించింది. కానీ, ఈ కేసులో మూడు దశాబ్దాల సుదీర్ఘ సర్వీసు ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారులు సైతం ఒక పొలిటికల్ బ్రోకర్ మాదిరి వ్యవహరించి వ్యవస్థను భ్రష్టు పట్టించారు. కేవలం విద్యాసాగర్ గుట్టు రట్టు కాకుండా చూసేందుకు, నటిని భయభ్రాంతులకు గురిచేసి కేసును క్లోజ్ చేయాలనుకున్న ప్లాన్ ఇప్పుడు సదరు అధికారుల మెడకే చుట్టుకుంది. తప్పుడు ఆర్డర్లను గుడ్డిగా పాటిస్తే కెరీర్‌తో పాటు జైలు పాలవ్వడం ఖాయమనే హెచ్చరికను ఈ జెత్వానీ కేసు తాజా చార్జిషీట్ బలంగా నిరూపిస్తోంది.తప్పు ఎవరి వైపు ఉంటే చట్టం వారిని శిక్షిస్తుంది!ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సీఐడీ సేకరించిన టెక్నికల్ లాగ్‌లు, ఫోన్ కాల్ డేటా, బ్యాంక్ బదిలీల రికార్డులు వంటి పక్కా సాక్ష్యాల వల్ల సస్పెండ్ అయిన ఐపీఎస్ అధికారులకు కోర్టుల నుంచి ఉపశమనం దక్కే అవకాశాలు దాదాపు లేవని న్యాయ నిపుణులు చెప్తున్నారు. వ్యక్తిగత సెటిల్‌మెంట్ల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడి, చట్టాన్ని బలిచేసిన ఈ పోలీసు మాఫియా తీరు భవిష్యత్తులో మిగిలిన అధికారులకు ఒక పెద్ద గుణపాఠం కానుంది.

# డిజిటల్ లూప్‌లో వైసీపీ - రాజకీయాల్లో రాత మారుతుందా?

విజయవాడ, జూలై 21ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడు సరికొత్త చర్చకు దారితీశాయి. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల పూర్తిగా డిజిటల్ పాలిటిక్స్ వైపే మొగ్గు చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. సొంత యాప్స్, టెక్నాలజీతో మన రాత మారిపోతుంది, కేడర్ అంతా డిజిటల్ వేదికలపై యాక్టివ్ కావాలి అని జగన్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం.. క్షేత్రస్థాయి రాజకీయాలను విస్మరించి క్యాడర్‌ను మభ్యపెట్టడమేనా అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల నుండి వస్తున్నాయి. కేవలం డిజిటల్ ప్రచారం, సొంత యాప్‌ల సృష్టి ద్వారా ఒక ప్రాంతీయ పార్టీ ప్రతిపక్ష హోదాలో ఎంతవరకు మైలేజ్ సాధించగలదనే అంశంపై భిన్నాభిప్రాయాలువ్యక్తమవుతున్నాయి. ఆధునిక రాజకీయాల్లో సోషల్ మీడియా, డిజిటల్ ప్రచారాల ప్రాధాన్యత పెరిగిన మాట వాస్తవమే. అయితే, వైఎస్సార్‌సీపీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఎక్స్‌టర్నల్ ప్లాట్‌ఫారమ్‌లలో వారి కంటెంట్‌కు ఆశించిన స్థాయిలో రీచ్ రాకపోవడం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు, కఠిన నిబంధనల కారణంగా పాత తరహా ప్రచారం నెమ్మదించింది. సాంప్రదాయ సోషల్ మీడియా సంస్థలు మన కంటెంట్‌ను నియంత్రించలేవని చెప్తూ.. పార్టీ కోసం ప్రత్యేకంగా సొంత యాప్‌లు, ఇన్-హౌస్ కమ్యూనికేషన్ టూల్స్ క్రియేట్ చేయడంపై జగన్ ఫోకస్ పెట్టారు. కానీ, ఈ డిజిటల్ గోడల మధ్య జరిగే ప్రచారం కేవలం సొంత డబ్బా లాగా మారి, కేవలం వైఎస్సార్‌సీపీ అభిమానులకే పరిమితం అవుతుందే తప్ప, తటస్థ ఓటర్లలోకి చొచ్చుకెళ్లే అవకాశం చాలా తక్కువని అభిప్రాయపడుతున్నారు.రాజకీయాల్లో డిజిటల్ ప్రచారం అనేది ఎప్పుడూ క్షేత్రస్థాయి పోరాటాలకు ఒక సపోర్టింగ్ టూల్ మాత్రమే కావాలి కానీ, అదే ప్రధాన ప్రత్యామ్నాయం కాలేదు. వైఎస్ జగన్ గతంలో అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం సుదీర్ఘమైన పాదయాత్ర, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావడం. కానీ, ప్రస్తుత ప్రతిపక్ష హోదాలో వైఎస్సార్‌సీపీ రాజకీయాలు ఇంకా రోడ్ల మీదికి, ప్రజల మధ్యకు చేరడం లేదనేది బహిరంగ రహస్యం. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో లాఠీ దెబ్బలు తింటూ, జైళ్లకు వెళ్తూ ధర్నాలు చేయకుండా.. కేవలం ఏసీ రూముల్లో కూర్చుని ట్వీట్లు , ప్రెస్ మీట్లు, యాప్‌లలో అప్‌డేట్లకు పరిమితం కావడం వల్ల మైలేజ్ రావడం కష్టమని సోషల్ మీడియా ట్రెండ్స్ చెబుతున్నాయి.ఈ డిజిటల్ పాలిటిక్స్ వల్ల క్యాడర్ అంతర్గతంగా ఒక తప్పుడు భరోసాలో ఉండిపోయే ప్రమాదం ఉంది. యాప్‌లలో బటన్ నొక్కితే ప్రచారం జరిగిపోతుంది.. రాత మారిపోతుంది అని అధినేత చెప్పడం వల్ల.. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిలబడే సాధారణ కార్యకర్తల్లో కదలిక తగ్గుతుంది. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ ప్రజల కోసం రోడ్లపైకి వచ్చి పోరాడనప్పుడు, ప్రజల్లో ఆ పార్టీపై నమ్మకం సడలుతుంది. డిజిటల్ స్క్రీన్లపై కనిపించే గ్రాఫిక్స్, హాష్‌ట్యాగ్‌లు ఓట్లుగా మారవనే చేదు నిజం 2024 ఎన్నికల్లోనే స్పష్టమైంది. జనాల్లోకి వెళ్లకుండా కేవలం డిజిటల్ పోరాటాలకే ప్రాధాన్యత ఇస్తే.. అది కేవలం పార్టీ శ్రేణులను తాత్కాలికంగా మభ్యపెట్టడానికే ఉపయోగపడుతుంది.డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సులువే కానీ, నేరుగా ప్రజల కష్టాల్లో భాగస్వామ్యం కాకపోతే ఆ మైలేజ్ వల్ల లాభం శూన్యం. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎప్పుడూ తమ కోసం రోడ్డుపై నిలబడే నాయకుడినే గుర్తిస్తారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు సైతం ఫీల్డ్ వదిలేసి కేవలం ప్రెస్ మీట్లకే పరిమితం కావడం పార్టీ గ్రాఫ్‌ను మరింత దెబ్బతీస్తోంది. కొత్త యాప్‌ల ద్వారా కేడర్‌ను అనుసంధానించవచ్చు కానీ, అది జనాల్లోకి వెళ్లేందుకు కేవలం ఒక మార్గమే కావాలి. డిజిటల్ వ్యూహాలు పార్టీ అంతర్గత సమన్వయానికి , అర్బన్ ఓటర్లను ఆకర్షించడానికి కొంతవరకు మేలు చేయవచ్చు. కానీ ఆంధ్రప్రదేశ్ లాంటి వైవిధ్యమైన రాజకీయ వాతావరణం ఉన్న రాష్ట్రంలో సొంత యాప్స్ పాలిటిక్స్ ఓట్ల రాతను మార్చలేవు. వైఎస్సార్‌సీపీ తిరిగి పుంజుకోవాలంటే డిజిటల్ స్క్రీన్లను దాటి, ప్రజల గడప తొ?క్కాల్సిందే. క్షేత్రస్థాయి పోరాటాల నుంచి వచ్చే అసలైన పొలిటికల్ మైలేజ్‌కు, డిజిటల్ ప్రపంచంలో వచ్చే తాత్కాలిక వ్యూస్‌కు చాలా తేడా ఉంటుందనే విషయాన్ని గ్రహించకపోతే.. వైఎస్సార్‌సీపీ డిజిటల్ లూప్‌లోనే ఉండిపోయే ప్రమాదం ఉందన్నది రాజకీయ నిపుణుల అభిప్రాయం.

# టీడీపీ, జనసేన నేతల మధ్య టగ్ ఆఫ్ వార్ తప్పదా?

విజయవాడ, జూలై 21, ఆంధ్రప్రదేశ్ రాజకీయం ప్రస్తుతం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో చారిత్రాత్మక విజయంతో కూటమి పక్షాలైన తెలుగుదేశం, జనసేన, బీజేపీలు అధికారంలోకి వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం రాబోయే స్థానిక పోరు సరికొత్త సమీకరణాలను తెరపైకి తెస్తోంది.ఈ ఎన్నికల్లో అధికార కూటమికి విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దగా పోటీ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అసలైన పోటీ, అంతర్గత ఘర్షణ అంతా కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన మధ్యే కేంద్రీకృతమైంది. గ్రామీణ స్థాయి అధికారం, ఉనికి కోసం ఇరు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకత్వం ఒకరితో ఒకరు తలపడటానికి సిద్ధమవుతుండటంతో, లోకల్ పోల్స్ కాస్తా కూటమి అంతర్గత బల ప్రదర్శనకు వేదికగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

1. సీట్లపై ఏకాభిప్రాయం కష్టమే!

ప్రధాన కారణం సీట్ల కేటాయింపులపై ఇరు పార్టీల అగ్రనేతల మధ్య వ్యూహాత్మక భిన్నాభిప్రాయాలు వ్యూహాత్మకంగా బయటకు రావడమే.

టీడీపీ భావన: గత అసెంబ్లీ ఎన్నికల నాటి సీట్ల పంపకాల ఫార్ములా (టీడీపీకి 85 శాతం, జనసేనకు 15 శాతం) బేస్ చేసుకుని స్థానిక సంస్థల్లోనూ ముందుకెళ్లాలని భావించింది.

జనసేన అభ్యంతరం: ఈ అసెంబ్లీ ఫార్ములా క్షేత్రస్థాయిలో అస్సలు పనిచేయదని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తేల్చేశారు. సార్వత్రిక ఎన్నికల నాటి త్యాగాలను ప్రతి ఊరిలోనూ పునరావృతం చేయలేమని, క్షేత్రస్థాయిలో తమకున్న బలాన్ని బట్టి తాము తగ్గేదే లేదంటూ జనసేన పట్టుబట్టడం కూటమి శ్రేణుల్లో ఒక్కసారిగా రాజకీయ వేడిని పుట్టించింది.

2. క్యాడర్ బలాన్ని చాటుకునేందుకు లీడర్ల పట్టు

ముఖ్యంగా ఉమ్మడి గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం, రాయలసీమలోని కొన్ని కీలక నియోజకవర్గాల పరిధిలో ఈ కోల్డ్ వార్ తీవ్ర రూపం దాల్చుతోంది.

టీడీపీ కేడర్ వాదన: గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులను తట్టుకుని నిలబడిన స్థానిక టీడీపీ కేడర్.. "మేము ఎమ్మెల్యే సీటునే త్యాగం చేశాం, కనీసం మా ఊరి సర్పంచ్, ఎంపీటీసీ సీటు కూడా మాకు ఇవ్వకపోతే ఎలా?" అని గట్టిగా నిలదీస్తున్నారు.

జనసైనికుల డిమాండ్: కూటమి అధికారంలోకి రావడానికి తమ ఓట్లే ప్రధాన కారణమని, క్షేత్రస్థాయిలో తమ అభ్యర్థులకు మెజారిటీ స్థానాలు కేటాయించకపోతే ఊరుకునేది లేదని జనసేన ద్వితీయ శ్రేణి లీడర్లు భీష్మించుకు కూర్చున్నారు. పైస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న కెమిస్ట్రీ కిందిస్థాయి గడప దాటడం లేదనేది దీని ద్వారా స్పష్టమవుతోంది.

3. పెరగనున్న తిరుగుబాటు అభ్యర్థుల ముప్పు

ఈ రాజకీయం రాబోయే రోజుల్లో పలు ఆసక్తికరమైన మలుపులు తిరిగే అవకాశం ఉంది. ఎక్కడైతే అధికారికంగా సీటు దక్కదో, అక్కడ ఇరు పార్టీల ఆశావహులు రెబల్స్ అభ్యర్థులుగా బరిలోకి దిగడానికి సిద్ధమవుతున్నారు.పల్లెల్లో సర్పంచ్ స్థానం అనేది కేవలం ఒక పదవి మాత్రమే కాదు, అది గ్రామాల్లో ఒక నిర్దిష్ట సామాజిక వర్గానికి, కుటుంబానికి ఉండే ప్రతిష్టకు సంబంధించిన అంశం. అందువల్ల అగ్రనాయకత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా కిందిస్థాయి లీడర్లు వెనక్కి తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ఈ అంతర్గత ఓట్ల చీలిక కొన్నిచోట్ల స్వతంత్రులకు లేదా తెరవెనుక పొంచి ఉన్న విపక్ష వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అనూహ్యంగా లాభం చేకూర్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

పరిష్కార మార్గాలు: సమన్వయం సాధించడం ఎలా?

పైస్థాయి నాయకత్వం మధ్య ఉన్న సమన్వయం కింద కూడా లేకపోతే వచ్చే ఈ తీవ్రమైన సమస్యలను పరిష్కరించుకోవడానికి కూటమి అధిష్టానం సరికొత్త అస్త్రాలను ప్రయోగించాల్సి ఉంటుంది.

ఉమ్మడి కో-ఆర్డినేషన్ కమిటీలు: కేవలం నోటి మాటలతో కాకుండా, జిల్లాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఇరు పార్టీల కీలక నేతలతో కమిటీలను ఏర్పాటు చేయాలి.

ఫ్రెండ్లీ కాంటెస్ట్ : ఎక్కడైతే ఇరు పార్టీలు బలంగా ఉన్నాయో, అక్కడ ఏకాభిప్రాయం కుదరకపోతే.. ఆయా గ్రామాల్లో స్నేహపూర్వక పోటీకి అనుమతించడం.

సీట్ల సమతుల్యత: ఒక పార్టీకి సర్పంచ్ స్థానం ఇస్తే, మరో పార్టీకి ఎంపీటీసీ ఇచ్చేలా సమతుల్యత పాటించడం ఏకైక మార్గంగా కనిపిస్తోంది.

మొత్తానికి ఈ స్థానిక సంస్థల ఎన్నికలు కూటమి ప్రభుత్వ ప్రజాదరణకు మాత్రమే కాదు, వారి అంతర్గత బంధానికి కూడా ఒక పెద్ద అగ్నిపరీక్ష. పైస్థాయిలో ఉన్న దోస్తీని క్షేత్రస్థాయి సమన్వయం ద్వారా పల్లెల్లోకి తీసుకెళ్లడంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఎంతవరకు సఫలమవుతారనే దానిపైనే కూటమి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. తమ సొంత అహంకారాలు, ఈక్వేషన్ల వల్ల పొత్తుల రొంపిలో తమ్ముళ్లు, సైనికులు కొట్టుకోకుండా చూసుకోవడమే ప్రస్తుతం కూటమి ముందున్న అసలైన టాస్క్.

# ఫీల్డ్ టూర్లకే బాబు ప్రాధాన్యం

## కుర్రాళ్లతో పోటీ పడే ఫిట్ నెస్ సొంతం

విజయవాడ, జూలై 21ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రస్థానాన్ని, ఆయన గత పరిపాలనా విధానాన్ని చూసిన వారికి ప్రస్తుతం ఆయన పనితీరు చూస్తున్న వారికి స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. గతంలో చంద్రబాబు అనగానే ఐటీ, కంప్యూటర్లు, పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్లు, సచివాలయంలో అర్ధరాత్రి దాటే వరకు సాగే సుదీర్ఘ సమీక్షా సమావేశాలు గుర్తొచ్చేవి. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయన తన శైలిని పూర్తిగా మార్చేసుకున్నారు. ఫైల్స్ చూసే సీఎం స్థానంలో ఇప్పుడు వారానికి రెండు, మూడు జిల్లాల్లో పర్యటిస్తూ నేరుగా జనం మధ్యకు వెళ్లే ఫీల్డ్ సీఎం గా దర్శనమిస్తున్నారు. సచివాలయం ఏసీ గదుల కంటే ప్రజాక్షేత్రమే పాలనకు అసలైన వేదిక అని ఆయన రుజువు చేస్తున్నారు.ఈ మార్పు వెనుక బలమైన వ్యూహం, అంతకంటే మిన్నగా ప్రజలతో నేరుగా మమేకం కావాలనే తపన స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేవలం విధానాల రూపకల్పనతో సరిపెట్టకుండా, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును స్వయంగా పరిశీలించడమే లక్ష్యంగా ఆయన తన షెడ్యూల్‌ను మార్చుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్ల పరిశీలన నుంచి రాయలసీమ లోని కుప్పం, నెల్లూరు, కడప జిల్లాల పర్యటనల వరకు.. స్వయంగా వెళ్లి పెన్షన్ల పంపిణీ చేయడం, పట్టాల పంపిణీ, స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్తున్నారు. అధికారులతో సుదీర్ఘ సమీక్షలను గణనీయంగా తగ్గించి, ఆ సమయాన్ని జనం మధ్య గడపడానికి కేటాయించడం క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని సైతం పరుగులు పెట్టిస్తోంది.వయసు రీత్యా చూస్తే ఈ వయసులో ఈ తరహా సుడిగాలి పర్యటనలు చేయడం ఎవరికైనా శారీరకంగా అత్యంత శ్రమతో కూడుకున్న పని. కానీ, చంద్రబాబు శారీరక దృఢత్వం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి నేటి యువతరం రాజకీయ నేతలకు కూడా సవాలు విసిరేలా ఉన్నాయి. ఉదయం ఆరింటికే పర్యటనలు ప్రారంభించడం, ఎండనక, వాననక గంటల తరబడి జనంలో తిరగడం వెనుక ఆయన అసాధారణమైన విల్ పవర్ దాగి ఉంది.

సాధారణ మనుషులకు ఊహకందని ఈ శక్తి, రాష్ట్ర భవిష్యత్తును మళ్లీ గాడిన పెట్టాలనే ఆయన తపన నుంచే పుట్టుకొచ్చిందని చెప్పవచ్చు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనతో పోల్చి చూస్తే.. ఈ వ్యత్యాసం మరింత స్పష్టంగా, కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. గతంలో ముఖ్యమంత్రి పర్యటనలు అంటే పరదాలు, బారికేడ్లు, కట్టుదిట్టమైన ఆంక్షలు, ప్రజా నిరసనలకు తావులేని మూసివేసిన సభలు గుర్తుకొచ్చేవి. అవి కూడా అసాధారణమే.కానీ నేడు చంద్రబాబు పర్యటనల్లో సామాన్యుడికి సైతం ముఖ్యమంత్రిని నేరుగా కలిసే అవకాశం లభిస్తోంది. జనం మధ్యకు నడుచుకుంటూ వెళ్తూ, వారి కష్టాలను నేరుగా వింటూ, అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు ఇస్తున్న చంద్రబాబు శైలి ఏపీ రాజకీయాల్లో సరికొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది.

# నైరుతి రిటర్న్స్...

హైదరాబాద్, జూలై 21,ఎల్‌నీనో ప్రభావంతో కొన్ని వారాలుగా అడపాదడపా వర్షాలు తప్పా.. వరణుడి కరుణ లేదు. ఉక్కపోతతో కూడిన వాతావరణం.. రైతులలో పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో వాతావరణ శాఖ వర్షాలపై కీలక అప్డేట్ ఇచ్చింది. దేశంలో పలుచోట్ల నైరుతి రుతుపవనాలు యాక్టివ్ అయ్యాయని వాతావరణ శాఖ తెలిపింది.. రాబోయే రోజుల్లో భారతదేశ నైరుతి రుతుపవనాలు తిరిగి బలం పుంజుకునేందుకు అవకాశం ఉండటంతో.. రాబోయే రోజుల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ.. అంచనా వేసింది. ప్రస్తుతం.. విస్తారంగా వర్షాలు కురవడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని.. ఆదివారం నుంచి వర్షపాతం క్రమంగా పెరిగి, వచ్చే వారం దేశంలోని పలు ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) పేర్కొంది. విడతల వారీగా కురిసే వర్షాలు నేలలో తేమను మెరుగుపరచి, పంట పెరుగుదలకు తోడ్పడి, మైదాన ప్రాంతాలంతటా నిరంతరంగా ఉన్న వేడి నుండి ఉపశమనం కలిగిస్తాయని అంచనా వేసింది.జూలై నెలలో చాలా వరకు రుతుపవనాలు బలహీనపడటానికి బంగాళాఖాతంలో బలమైన వాతావరణ వ్యవస్థలు లేకపోవడమే కారణమని చెప్పవచ్చు. తక్కువ అల్పపీడన వ్యవస్థలు ఏర్పడటంతో, తేమ రవాణా బలహీనపడి, మధ్య ? ద్వీపకల్ప భారతదేశం అంతటా సుదీర్ఘ పొడి వాతావరణం నెలకొంది. అనేక నగరాల్లో తేమ అధికంగా ఉన్నప్పటికీ, మేఘాలు ఏర్పడటం పరిమితంగా ఉండటంతో, చెప్పుకోదగ్గ వర్షపాతం లేక ప్రజలు అసౌకర్యమైన వేడిని తట్టుకోవలసి వచ్చింది. ఈ కాలంలో, వర్షపాతం ప్రధానంగా హిమాలయ ప్రాంతంలోని కొన్ని భాగాలకే పరిమితమైంది. అయితే పెద్ద వ్యవసాయ ప్రాంతాలలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది.

# ఎస్ఐఆర్ కార్యక్రమంలో డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి...

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
### రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో 90 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని చేరుకోవాలి
### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై21 ప్రజాబలం:**ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని వేగవంతం చేసి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.




మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియ, ఫిర్యాదుల పరిష్కారం, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరిస్తూ, ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 80 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 65 శాతం డిజిటలైజేషన్ జరిగిందని తెలిపారు. జిల్లాలో శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన ఓటర్ల సంఖ్య సుమారు 55 వేలు (5 శాతం) ఉండగా, వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో సుమారు 85 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లేనని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. సోమవారం ఒక్కరోజే జిల్లాలో 20 వేల మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని, ఇదే వేగంతో పనులు కొనసాగిస్తే రానున్న ఐదు రోజుల్లో 90 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని చేరుకుంటామని కలెక్టర్ తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించిన మేరకు ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) లక్ష్యం మేరకు ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేసేలా కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షిస్తూ లక్ష్యాలను సాధించాలని సూచించారు.

పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, 50 శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించి బీఎల్‌వోలకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ప్రతి ఓటరుకి అందించిన ఎన్యూమరేషన్ ఫారం నింపడంలో బీఎల్‌వోలు ప్రజలకు సహకరించాలని, ఎన్నికల సంఘం రూపొందించిన అవగాహన వీడియోలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీ, ఇతర ఎన్నికల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యాసంస్థలోని యువతను మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలి...

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. శ్రీజ
### జిల్లా యూత్ పార్లమెంట్ నిర్వహించి రాష్ట్ర స్థాయికి ప్రతిభావంతులను ఎంపిక చేయాలి
### ఎనిమిది విభాగాల్లో నషా ముక్త్ భారత్ పోటీలు నిర్వహించాలి
### ప్రతి నెల కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహించాలి.

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై21 ప్రజాబలం:**కేంద్ర ప్రభుత్వం యువత కోసం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు.




మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా యువజన కార్యక్రమాల సలహా సంఘం సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా యువతకు వివిధ రంగాల్లో అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 14 వేల మంది యువత ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ప్రత్యేక నమోదు కార్యక్రమం ద్వారా ఈ సంఖ్యను మరింత పెంచాలని సూచించారు.




జిల్లాలోని ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్ కళాశాలలతో పాటు అన్ని విద్యాసంస్థలను సందర్శించి ప్రతి విద్యార్థిని మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు. అలాగే ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.

జిల్లా స్థాయిలో యూత్ పార్లమెంట్ నిర్వహించి విజేతలను రాష్ట్ర స్థాయికి పంపాలని, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన యువతకు భారత పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు.

వికసిత్ భారత్ కార్యక్రమంలో నిర్వహించే క్విజ్ పోటీల్లో విజేతలకు దేశ సరిహద్దు రాష్ట్రాల పర్యటన అవకాశం లభిస్తుందని, కొన్ని కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రధాన మంత్రిని కలిసే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాలపై యువతలో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.


నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనం, తదితర ఎనిమిది రకాల పోటీలను జిల్లాలో నిర్వహించాలని సూచించారు. జిల్లా స్థాయిలో విజేతలకు కేంద్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు.

యువతకు భవిష్యత్ కెరీర్‌పై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు ప్రతి నెల చివరి ఆదివారాల్లో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్య, వివిధ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలు, రక్షణ రంగం, ఇతర వృత్తి రంగాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు.

కెరీర్ గైడెన్స్ కార్యక్రమాల సమర్థ నిర్వహణ కోసం సంబంధిత శాఖలతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, అవసరమైన అధ్యయన సామగ్రి, పరీక్షల విధానం, కెరీర్ మార్గదర్శక సమాచారాన్ని సిద్ధం చేసి విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ వెంకట్రామ్ బాబు, జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి. జ్యోతి , లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ. రవిప్రసాద్, జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి కె. రవిబాబు, జిల్లా విద్యాధికారి, జిల్లా యువజన క్రీడల అధికారి టి. సునీల్ రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, ఎన్ఎస్–ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ రావు, అడిషనల్ డిఎంహెచ్ఓ., సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ములుగు పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి మంత్రి సీతక్క



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జులై 21 ములుగు** జిల్లాలోని ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులందరికీ తెలంగాణ ప్రభుత్వం తరఫున స్వాగతం పలుకుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు.

అయితే పర్యాటకులు తమ ఆనంద యాత్రను విషాదంగా మార్చుకోకుండా తప్పనిసరిగా జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, అటవీ శాఖ అధికారులు జారీ చేస్తున్న సూచనలు, హెచ్చరికలను పాటించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించి అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క వీడియో సందేశం విడుదల చేశారు.

ములుగు జిల్లా ప్రకృతి సంపదకు నిలయమని, దట్టమైన అడవులు, గోదావరి పరీవాహక ప్రాంతం, బొగత జలపాతం, అందమైన సెలయేళ్లు, చారిత్రక, ఆధ్యాత్మిక క్షేత్రాలు ప్రతి ఏడాది వేలాది మంది పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. సమ్మక్క––సారలమ్మ మేడారం, రామప్ప దేవాలయం, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయం వంటి ప్రసిద్ధ ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చే ప్రతి ఒక్కరూ సురక్షితంగా వెళ్లి సంతోషకరమైన జ్ఞాపకాలతో తిరిగి వెళ్లాలని ప్రభుత్వం కోరుకుంటోందన్నారు.

ఇటీవల నిషేధిత ప్రాంతాల్లోకి వెళ్లి ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరమని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. లోతైన అడవులు, ప్రమాదకరమైన జలపాతాలు, కొండచరియలు, వేగంగా ప్రవహించే వాగులు, సెలయేళ్ల వద్దకు వెళ్లవద్దని ఇప్పటికే పోలీసులు, అటవీశాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అయినప్పటికీ కొందరు ఆసక్తితో బ్యారికేడ్లను దాటి నిషేధిత ప్రాంతాల్లోకి వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

పర్యాటకుల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు. అధికారులు ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటరాదని, హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా గౌరవించాలని, సెల్ఫీలు లేదా వీడియోల కోసం ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లి ప్రాణాలను రిస్క్ చేయవద్దని సూచించారు. ముఖ్యంగా డీప్ ఫారెస్ట్ ప్రాంతాలు, లోతైన జలపాతాలు, వేగంగా ప్రవహించే వాగులు, కొండల అంచులు వంటి ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరారు.పర్యాటకులు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, భద్రతా నిబంధనలు పాటిస్తేనే ప్రయాణం సురక్షితంగా, ఆనందంగా ఉంటుందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రతి ఒక్కరూ అధికారుల సూచనలను పాటించి తమతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితుల భద్రత పట్ల కూడా బాధ్యతతో వ్యవహరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఇల్లందు బొమ్మనపల్లి మార్గంలో ట్రాఫిక్ డైవర్షన్ ఎత్తివేత

### రేపటి ఉదయం నుంచి వాహనాల రాకపోకలకు అనుమతి



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై21 ప్రజాబలం:**ఇల్లందు క్రాస్ నుండి బొమ్మనపల్లి క్రాస్ మధ్యలోని లోతువాగు గ్రామం వద్ద జాతీయ రహదారి పై ఉన్న ఓవర్ బ్రిడ్జికి చేపట్టిన మరమ్మత్తు పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో అమలులో ఉన్న ట్రాఫిక్ డైవర్షన్ ఆంక్షలను రేపు ఉదయం అనగా 22.07.2026, 08:00 గంటల నుండి ఎత్తివేస్తున్నట్లు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వెల్లడించారు.

రేపు ఉదయం నుంచి వాహనాలు యథావిధిగా ఓవర్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించవచ్చని ఆయన పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ, సూచిక బోర్డులు మరియు ట్రాఫిక్ పోలీసుల సూచనలను అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల సహకారంతో మరమ్మతు పనులు సజావుగా పూర్తయ్యాయని, భవిష్యత్తులో కూడా ట్రాఫిక్ నిర్వహణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతంగా మరమ్మత్తు పనులను పూర్తి చేయడంపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సంబంధిత అధికారులను, ఇంజినీరింగ్ సిబ్బందిని మరియు పోలీసు అధికారులను అభినందించారు.

# 20 జిల్లాల్లో డేంజర్ బెల్స్....

కర్నూలు జూలై 21 ఏపీలో తీవ్ర వర్షాభావం నెలకొంది. కనీస స్థాయిలో కూడా వర్షాలు పడడం లేదు. ఆకాశం మేఘావృతం అవుతుందే తప్ప వరుణుడు మాత్రం దోబూచులాడుతున్నాడు. దీంతో ఏపీలో లోటు వర్షపాతం 35 శాతానికి పెరిగింది. మొత్తం 28 జిల్లాలకు గాను.. దాదాపు 20 జిల్లాల్లో అత్యల్ప వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జూన్ 1 నుంచి జూలై 17 మధ్య సాధారణ వర్షపాతం 162.6 మిల్లీమీటర్లు కాగా.. రాష్ట్రంలో 106.3ఎ వర్షపాతం మాత్రమే నమోదు అయినట్లు భారత వాతావరణ శాఖ చెబుతోంది.


× కోస్తాంధ్ర ప్రాంతానికి సంబంధించి గుంటూరు, పల్నాడు, విజయనగరం జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది.

× రాయలసీమకు సంబంధించి అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది. అయితే ఈ జిల్లాలను మినహాయించి మిగతా జిల్లాల్లో అయితే భారీ లోటు వర్షపాతం నమోదు అయింది.


× పశ్చిమగోదావరి, అన్నమయ్య, యానం జిల్లాల్లో 60 శాతం లోటు వర్షపాతం నమోదు అయింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 50% కంటే ఎక్కువ లోటు నమోదయింది. తిరుపతి, కడప, బాపట్ల, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, ప్రకాశం జిల్లాల్లో 40% కంటే ఎక్కువ వర్షపాతం లోటు నమోదయింది. ఒక్క అనంతపురం జిల్లాలో మాత్రమే సాధారణ స్థాయికి సమానమైన 95.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

× జూన్ 1 నుంచి జూలై 17 వరకు సాధారణ వర్షపాతం ఏపీలో 192.7 ఎ కాగా.. 35 శాతం లోటుతో 126 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

# తిట్టు తిట్టించు... తెలంగాణలో నయా రాజకీయం










హైదరాబాద్, జూలై 21 తెలంగాణలో రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శల స్థానాన్ని ఇప్పుడు పచ్చి బూతులు, తీవ్రమైన వ్యక్తిగత దూషణలు ఆక్రమిస్తున్నాయి. శనివారం ఉదయం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగిన నిరుద్యోగుల సదస్సు ఇందుకు తాజా ఉదాహరణగా నిలిచింది. ఈ సమావేశంలో నిరుద్యోగుల సమస్యలను పక్కనబెట్టి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో తిట్లందుకున్నారు. ఇక దీనికి ప్రతిగా సాయంత్రం వేదికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అదే స్థాయిలో విరుచుకుపడ్డారు. నువ్వెంత.. నీ బిశాదెంత.. నీ జాతెంత. నీ జాతి మా ప్రజా పాలన మీద శాపనార్థాలు పెడ్తదా. అంటూ సీఎం కౌంటర్ ఇచ్చారు. రాజకీయాల్లో విధానపరమైన విమర్శలు సహజం. కానీ, ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా సాగుతున్న ఈ తిట్ల పురాణం రాను రాను పౌర సమాజానికి, సామాన్య ప్రజలకు సైతం తీవ్ర అసహ్యం కలిగిస్తోంది. నిరుద్యోగ సంగ్రామ సభ పెట్టిన కేటీఆర్ కొంత మందియువతతో మాట్లాడించారు. వారు రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత బూతులు తిట్టడానికే తమ సమయం కేటాయించారు. ఇందులో మహిళలు కూడా ఉన్నారు. ఇలా ఓ ముఖ్యమంత్రిని ఉద్దేశపూర్వకంగా తిట్టించడం.. దాన్ని కేటీఆర్ ఆస్వాదించడం ఏ మాత్రం సమర్థనీయంగా లేదు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ తిట్ల పురాణాన్ని ఊరికే వదిలేయడం లేదు. తనపై వస్తున్న విమర్శలను, దూషణలను ఆయన అత్యంత తెలివిగా ఒక పక్కా పొలిటికల్ అస్త్రంగా మలచుకుంటున్నారు. తనను తిడుతున్న ప్రతి సందర్భాన్ని పరోక్షంగా ఒక సామాజిక అంశంగా మారుస్తూ, తెలంగాణ సమాజంలో గత పాలకుల సామాజికవర్గం పై సహజంగా ఉండే కొన్ని వర్గాల వ్యతిరేకతను మరింత పెంచడానికి వాడుకుంటున్నారు. తెలంగాణను పదేళ్లు దోచుకున్న ఒక నిర్దిష్ట జాతి శక్తులు.. ఇప్పుడు పేదల ప్రజా పాలనపై శాపనార్థాలు పెడుతున్నాయి అనే నేరేటివ్‌ను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా సెంటిమెంట్‌ను రగిల్చే వ్యూహాన్ని రేవంత్ అమలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ జాతి, జాతెంత అనే వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నమైన చర్చ నడుస్తోంది. రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగానే కేసీఆర్ కుటుంబ సామాజికవర్గాన్ని టార్గెట్ చేశారని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతుంటే.. గతంలో కేసీఆర్, కేటీఆర్ ప్రతిపక్ష నేతలను లఫంగి, సన్నాసి అంటూ సంబోధించినప్పుడు లేని సంస్కారం ఇప్పుడెందుకు గుర్తుకొచ్చిందని కాంగ్రెస్ సోషల్ మీడియా వారియర్స్ కౌంటర్లు ఇస్తున్నారు. ఈ సోషల్ మీడియా వార్‌తో రాష్ట్రంలో పొలిటికల్ డిస్కషన్ పూర్తిగా పక్కదారి పట్టి, కేవలం కుల సమీకరణాలు, ఈగో క్లాషెస్ చుట్టూనే తిరుగుతోంది. ఇది ఆ పార్టీలకు ఎలాంటి మేలు చేయదు.

మౌన రాజకీయాలు చేస్తున్న మల్లారెడ్డి

తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నేత, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని లక్ష్యంగా చేసుకుని సొంత పార్టీ సోషల్ మీడియా విభాగాలు ఒక్కసారిగా దాడికి దిగడం ఇప్పుడు రాష్ట్ర పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రజాకవి అందెశ్రీకి సంబంధించిన ఒక అధికారిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి మల్లారెడ్డి ఒకే వేదికను పంచుకున్నారు. ఆ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి వేదికపై నుంచే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో రాజకీయ విమర్శలు గుప్పించారు. అయితే, రేవంత్ రెడ్డి విమర్శలు చేస్తున్నప్పుడు పక్కనే ఉన్న మల్లారెడ్డి వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదని, కనీసం నిరసన కూడా తెలపకుండా మౌనంగా ఉండిపోయారనేది గులాబీ శ్రేణుల ప్రధాన ఆగ్రహం. వాస్తవానికి, గత కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాల్లో మల్లారెడ్డి పెద్దగా చురుగ్గా వ్యవహరించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన పార్టీ కార్యక్రమాలకు కాస్త దూరంగానే ఉంటున్నారు. వర్తమాన రాజకీయాల్లో ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా భారీ విద్యాసంస్థలు, వ్యాపార సామ్రాజ్యాలు ఉన్న నాయకులు ఎదుర్కొనే రాజకీయ ఒత్తిళ్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏ రకమైన సమీకరణాలు, వ్యూహాలతో మల్లారెడ్డిని పార్టీలోకి చేర్చుకున్నారో.. ఇప్పుడు కేంద్ర, రాష్ట్రాల్లోని అధికార పార్టీలు కూడా అదే తరహా ఒత్తిళ్లకు లేదా ఆకర్షణ మంత్రాలకు పాల్పడుతున్నాయనేది బహిరంగ రహస్యం. ఇలాంటి కత్తిమీద సాము లాంటి పరిస్థితుల్లో, ఆయన పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, సొంత పార్టీ బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఎక్కడా ఒక్క మాట కూడా మాట్లాడకుండా సైలెంట్‌గా ఉండటమే ఒక రకంగా గొప్ప విషయం. ఈ సున్నితమైన తరుణంలో మల్లారెడ్డి లాంటి సీనియర్ నేతను గుర్తించకుండా, ఆయనపై సోషల్ మీడియా ద్వారా దాడి చేయించడం వల్ల బీఆర్ఎస్‌కు ఎలాంటి రాజకీయ ప్రయోజనమూ ఉండదు. మల్లారెడ్డి కేవలం ఒక సాధారణ ఎమ్మెల్యే మాత్రమే కాదు; మేడ్చల్ నియోజకవర్గంతో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని, బలమైన అనుచరగణాన్ని సంపాదించుకున్న ఒక స్టేచర్ ఉన్న లీడర్. ఆయన వ్యాపారాలు, విద్యాసంస్థల రక్షణ కోసం అధికార పక్షంతో సఖ్యతగా ఉండటం రాజకీయంగా సహజం. అంతమాత్రానికే ఆయనను బలిపశువును చేస్తూ ట్రోలింగ్ చేయడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు. రేపటి రోజున రాజకీయ సమీకరణాలు మారి, కాంగ్రెస్ లేదా బీజేపీ కంటే బీఆర్ఎస్ పార్టీయే తమ భవిష్యత్తుకు బెటర్ అని మల్లారెడ్డి భావిస్తే.. ఆయన పార్టీ మారాలనే ఆలోచనను పక్కన పెట్టి మళ్లీ గులాబీ గూటిలోనే కొనసాగే అవకాశం ఉంటుంది. అలా కాకుండా ఇప్పుడే ఆయనను టార్గెట్ చేసి దూరం చేసుకుంటే, ఆయన అధికార పార్టీ వైపు అడుగులు వేయడానికి బీఆర్ఎస్సే స్వయంగా దారి చూపించినట్లవుతుంది. కాబట్టి, ఆవేశంతో కాకుండా ఆలోచనతో, మల్లారెడ్డి లాంటి సీనియర్ల విషయంలో వ్యూహాత్మక మౌనాన్ని ప్రదర్శించడమే బీఆర్ఎస్ లీడర్‌షిప్‌కు మేలు చేకూరుస్తుందని అనుకోవచ్చు.

## గ్యాప్ కంటిన్యూస్..

మెదక్,జూలై 21 బీఆర్ఎస్ పార్టీలో హరీష్ రావు వర్సెస్ కేటీఆర్ పంచాయితీ నడుస్తుంది అన్న గుసగుసలు, లీకులు కొత్తేమీ కాకపోయినా, తాజాగా రంగనాయక్ సాగర్ వద్ద జరిగిన హరీష్ రావు పాదయాత్ర మరోసారి ఆ ఆరోపణలకు బలం చేకూర్చినట్లైంది. కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టులు నింపాలని, కరువులో రైతన్నలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అన్నపూర్ణ సాగర్ నుండి రంగనాయక సాగర్ వరకు మాజీ మంత్రి హరీష్ రావు పాదయాత్ర చేశారు. హరీష్ రావు పాదయాత్రకు ఏర్పాట్లు కూడా భారీగానే జరిగాయి. భారీ ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలతో హరీష్ పాదయాత్ర సాగింది. అయితే, వాటిలో ఎక్కడా కేటీఆర్ ఫోటో లేదు. భారీ సైజులో హరీష్ రావు, చిన్నగా కేసీఆర్ ఫోటోతో మాత్రమే కనపడ్డాయి. దీంతో ఎంత సిద్ధిపేట కేంద్రంగా పాదయాత్ర చేసినా? పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ ఫోటో వేయటం కనీసం ప్రోటోకాల్. బాధ్యత. కానీ, కేటీఆర్ ఫోటోను ఎందుకు పక్కనపెట్టినట్లు? కావాలనే ఇలా చేశారన్న అభిప్రాయం వినపడుతోంది. నిజానికి తాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా రాష్ట్రంలో పాదయాత్ర చేస్తాను అని ఇప్పటికే కేటీఆర్ ప్రకటించారు. జిమ్ లో జాయిన్ అయ్యి, రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు సన్నద్ధం కూడా అవుతున్నారు. ఆ మధ్య సంగారెడ్డి జిల్లా రైతాంగానికి అండగా ఉండేందుకు, సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టు కోసం పాదయాత్ర చేస్తానని హరీష్ రావు ప్రకటించారు. ఇప్పుడు సిద్ధిపేట జిల్లాలో ప్రాజెక్టుల వద్ద పాదయాత్ర చేస్తున్నారు. పైగా పార్టీ జెండాల్లో ఎక్కడా కేటీఆర్ ఫోటో లేకుండా. పార్టీలో వెనకబడకుండా ఉండేందుకే హరీష్ వర్గం ఈ పాదయాత్రలను టేకప్ చేసిందని? కావాలనే కేటీఆర్ ఫోటోను పక్కనపెట్టిందని? కృష్ణార్జునులు అని ఎంత చెప్పినా, ఆధిపత్య పోరు ఎంతలా ఉందో ఇప్పుడు కనపడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో కవిత కూడా పార్టీలో కొట్లాటలు, ఆధిపత్యపోరు గురించి చెప్పిన మాటలను కూడా ప్రస్తావిస్తున్నారు.

## స్టార్టప్ టూ... స్కై హై...

హైదరాబాద్, జూలై 21 శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుండి జూలై 18, శనివారం, మధ్యాహ్నం 12:05 ఎొుకి విక్రమ్-1 ప్రయోగం ప్రారంభమైంది. 17 నిమిషాల తర్వాత, ఇది తన పేగులకు సంబంధించిన ఉపకరణాలను విజయవంతంగా విడుదల చేసింది. ఈ ఘనతకు 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్‌లో సంబరాలు గట్టిగా జరిగాయి. ఈ తొలి ప్రయోగం, 'ఆగమన్' అని పిలువబడింది, భారతదేశాన్ని ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యం కలిగిన మూడవ దేశంగా నిలిపింది. అయితే, తెలంగాణకు ఇది ఒక దశాబ్ద కాలం పాటు ఆవిష్కరణ వ్యవస్థను నిర్మించడానికి పెట్టిన పెట్టుబడికి ఫలితం. ఈ ప్రయాణం 2015 నవంబరులో ప్రారంభమైంది, అప్పటి ఐటీ మరియు పరిశ్రమల మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో టీ హబ్ ప్రారంభమైంది, ఇది అప్పటివరకు భారతదేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇన్క్యూబేటర్. ప్రారంభోత్సవంలో, రతన్ టాటా దీనిని 'భారతదేశానికి కొత్త ముఖం' అని పేర్కొన్నారు. ఈ చుట్టూ, రాష్ట్రం విస్తృతమైన నెట్‌వర్క్‌ను నిర్మించింది - ప్రోటోటైపింగ్ కోసం టీ వర్క్స్, మహిళా వ్యాపారులకు, నైపుణ్యాలు, పరిశోధన మరియు అకాడమియా-ఇండస్ట్రీ సంబంధాల కోసం టాస్క్, రిచ్ తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ సెల్. స్కైరూట్ ఎయిరోస్పేస్ ఈ వ్యవస్థలో జన్మించింది. 2018లో, మాజీ ఇస్రో శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన మరియు నాగ భారత్ డాకా స్థాపించిన ఈ కంపెనీ, ౧-ఊబీఎలో ప్రారంభ సంవత్సరాలలో ఇన్క్యూబేట్ చేయబడింది, మెంటార్షిప్, పెట్టుబడిదారుల ప్రాప్తి మరియు వ్యాపార మద్దతు పొందింది. ఇది డ్రాయింగ్‌ల నుండి హార్డ్‌వేర్‌కు మారుతున్నప్పుడు, తన ఇంజనీర్లకు ప్రోటోటైపింగ్ సౌకర్యాలను అందించింది, దీని ద్వారా భాగాలను డిజైన్ చేయడం, పరీక్షించడం మరియు మెరుగుపరచడం జరిగింది. దీని వల్ల సాధించిన ఫలితాలు త్వరగా వచ్చాయి. 2022 నవంబరులో, స్కైరూట్ యొక్క ఉపఆర్బిటల్ విక్రమ్-ూ, ఇస్రో యొక్క సౌకర్యాల నుండి రాకెట్‌ను ప్రయోగించిన తొలి భారతీయ ప్రైవేట్ కంపెనీగా నిలిచింది. టీ హబ్ లో జరిగిన ఒక వేడుకలో, కేటీఆర్ దీనిని భారతదేశం యొక్క అంతరిక్ష సాంకేతిక పరిశ్రమకు 'నిజంగా చరిత్రాత్మక క్షణం' అని పేర్కొన్నాడు. 'ఇది హైదరాబాద్ నుండి మరింత మంచిగా జరగలేదు' అని చెప్పాడు మరియు రాష్ట్రంలో దేశంలోని తొలి సమగ్ర రాకెట్ డిజైన్, తయారీ మరియు పరీక్షా సౌకర్యం కోసం ప్రోత్సహించాడు.

## ఫలించిన 22 ఏళ్ల పోరాటం

మెదక్, జూలై 21 ఫ్యాబ్‌సిటీ భూ నిర్వాసిత రైతుల 22 ఏళ్ల పోరాటం ఫలించింది. కందుకూరు మండలం లేమూరులోని సర్వే నంబర్ 102లో అభివృద్ధి చేసిన ప్లాట్లను కేటాయించేందుకు రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు అంగీకరించారు. ఆరుగురు సీఎంలకు విన్నవించి, ఇటీవల మూడు నెలల పాటు దీక్షలు చేసిన రైతుల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో మార్గం సుగమమైంది. ఈ మేరకు 23 మంది సీలింగ్ పట్టాదారులకు 325 చ.గజాలు, కాస్తులో ఉన్న 148 మందికి 200 చ.గజాల చొప్పున ప్లాట్లు దక్కనున్నాయి. అయితే 38ఈ పట్టాదారుల సమస్య పరిష్కారం కావాల్సి ఉంది. ఫ్యాబ్‌సిటీ భూ నిర్వాసితుల సుదీర్ఘ పోరాటం ఎట్టకేలకు 22 సంవత్సరాల తర్వాత ఫలించింది. నిర్వాసిత రైతులకు రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం లేమూరులో ప్లాట్లు కేటాయించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని తుక్కుగూడ డివిజన్ పరిధిలోని రావిర్యాల, జెన్నాయిగూడ గ్రామాల్లో మొత్తం 730.17 ఎకరాల భూమిని 2003-04లో అప్పటి ప్రభుత్వం ఏపీఐఐసీ కోసం సేకరించింది. ఇందులో కొండలు, గుట్టలు ఉన్న ప్రాంతాన్ని మినహాయించి.. మిగిలిన 679.13 ఎకరాలకు పరిహారంగా జెన్నాయిగూడ వద్ద 35 ఎకరాలను అభివృద్ధి చేసి ప్లాట్ల రూపంలో కేటాయిస్తామని అప్పట్లో ప్రతిపాదించారు. అయితే.. ఆ సమయంలో కేటాయించిన ప్యాకేజీకి 38ఈ పట్టా రైతులు అంగీకరించకపోవడంతో కేటాయింపు ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వాలు మారడంతో బాధితులకు న్యాయం జరగలేదు. ఈ సమస్య పరిష్కారం కోసం భూనిర్వాసిత రైతులు గత 22 ఏళ్లుగా విరామం లేకుండా పోరాటం చేస్తూనే ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి నేటి వరకు దాదాపు ఆరుగురు ముఖ్యమంత్రుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. 2003లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబాబును, 2006లో వైఎస్ రాజశేఖరరెడ్డిని కలిశారు. ఆ తర్వాత కొణిజేటి రోశయ్య, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలకు వినతిపత్రాలు ఇచ్చారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ విషయాన్ని కేసీఆర్, కేటీఆర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టే సమయంలో మళ్లీ ప్రభుత్వం మారింది. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు గత మూడు నెలలుగా రిలే నిరాహారదీక్షలు చేపట్టడం గమనార్హం.ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేఎల్‌ఆర్.. బాధితుల సమస్యను ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని టీజీఐఐసీ ఎండీని ఆదేశించింది. దీంతో స్పందించిన అధికారులు కందుకూరు మండలం లేమూరులోని సర్వే నంబరు 102లో ఉన్న 130 ఎకరాల అసైన్డ్ భూమిని అభివృద్ధి చేసి రైతులకు ప్లాట్లు ఇవ్వడానికి అంగీకరించారు.

## ముందుకు సాగని ఎస్ ఐఆర్

హైదరాబాద్, జూలై 21 హైదరాబాద్ ాఎఖీ ప్రక్రియ సజావుగా నడవటం లేదు. బీఎల్‌ఓలు ఎన్యుమరేషన్ ఫారంలను పంపిణీ చేసి తిరిగి ఇవ్వాలని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. హైదరాబాద్ లో మాత్రం బీఎల్‌ఓలు ాఎఖీ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనడం లేదు. హైదరాబాద్ నగరం పరిధి ఎక్కువ కావడం, అపార్ట్ మెంట్లు ఎక్కువగా ఉండటంతో వాచ్ మెన్ కు ఎన్యుమరేషన్ ఫారాలు ఇచ్చి వెళ్లిపోయే వారి సంఖ్య ఎక్కువగా కనపడుతుంది. ఎన్యుమరేషన్ ఫారాలు నింపడానికి అవసరమైన సలహాలు, సూచనలు కూడా చేయకపోవడంతో బీఎల్‌ఓలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటి వరకూ ఇరవై శాతం మాత్రమే ఎన్యుమరేషన్ జరిగిందని చెబుతున్నారు. బీఎల్‌ఓలు పెద్దగా పట్టించుకోకపోవడంతోనే ాఎఖీ ప్రక్రియ సజావుగా నడవడం లేదు. పైగా బీఎల్‌ఓలు ఎన్యుమరేషన్ ఫారం పూర్తి చేయడంలో సహకరించాల్సింది పోయి అసలు పట్టీపట్టన్నట్లు వ్యవహరించడంతోనే ఈ ప్రక్రియ సజావుగా జరగడం లేదు. అనేక మంది తమకు ఓట్లు ఉన్నా లేకపోయినా పరవాలేదు అనుకునే దశకు చేరుకున్నారు. బీఎల్‌ఓలు నిర్లక్ష్యం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని అంటున్నారు. .. దీనికి బీఎల్‌ఓలను ప్రశ్నిస్తే తాము వచ్చి ఫారాలు నింపేందుకు సహకరించలేమని, తమకు మంచినీళ్లు కూడా ఇవ్వడం లేదని ఎదురుదాడికి దిగుతున్నారు. అనేక ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. హైదరాబాద్ లో అపార్ట్ మెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటన్నింటికీ ఎక్కి దిగాలంటే కష్టమే.

# నకిలీ మందుల చెలామణి అరికట్టాలి

## (సి.హెచ్.ప్రతాప్)

మందు అనేది ప్రాణాలను కాపాడే సాధనం. అదే నకిలీగా మారితే ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తుంది. గతంలో తెలంగాణలో నకిలీ మందులు, నాణ్యతలేని ఔషధాలు, లైసెన్స్ లేకుండా మందుల విక్రయం వంటి ఘటనలు వరుసగా వెలుగుచూస్తుండటం ప్రజారోగ్యానికి తీవ్రమైన హెచ్చరిక. హైదరాబాద్‌తో పాటు మేడ్చల్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, హనుమకొండ జిల్లాల్లో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) నిర్వహించిన దాడుల్లో నకిలీ మందులు, అనధికారికంగా నిల్వ చేసిన ఔషధాలు, లైసెన్స్ లేని మెడికల్ షాపులు గుర్తించడం సమస్య తీవ్రతను వెల్లడిస్తోంది.

తెలంగాణ దేశంలో ప్రముఖ ఔషధ తయారీ కేంద్రంగా పేరొందింది. ఇక్కడ తయారయ్యే మందులు దేశ విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అలాంటి రాష్ట్రంలో కొద్దిమంది అక్రమ వ్యాపారుల చర్యలు మొత్తం ఔషధ రంగ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రమాదం ఉంది. నకిలీ మందుల వల్ల వ్యాధి తగ్గకపోవడమే కాకుండా, రోగి పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా యాంటీబయాటిక్స్, గుండెజబ్బులు, మూర్ఛ, మధుమేహం, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు సంబంధించిన నకిలీ మందులు ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. అంతేకాదు, నాణ్యతలేని యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల ఔషధ నిరోధకత (ఆంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్) పెరిగి భవిష్యత్తులో చికిత్స మరింత క్లిష్టంగా మారే ప్రమాదం కూడా ఉంది.

ఇటీవలి కాలంలో తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నకిలీ మందుల ముఠాలపై చర్యలు తీసుకోవడం, లైసెన్స్ లేని విక్రయ కేంద్రాలను సీజ్ చేయడం, నాణ్యతలేని మందుల విక్రయాన్ని గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, ప్రజలకు ఎస్ఎంఎస్ హెచ్చరిక వ్యవస్థను అందుబాటులోకి తేవడం వంటి చర్యలు అభినందనీయమైనవి. అయితే తనిఖీలు, కేసుల నమోదుతోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. అక్రమ తయారీ కేంద్రాల మూలాలను గుర్తించి కఠిన శిక్షలు అమలు చేసినప్పుడే ఈ దందాకు చెక్ పడుతుంది.

ఔషధ తయారీ నుంచి వినియోగదారుడి చేతికి చేరే వరకు ప్రతి దశలో పటిష్ఠ పర్యవేక్షణ అవసరం. ప్రతి మెడికల్ షాపులో నమోదిత ఫార్మసిస్టు ఉండేలా చూడాలి. ఆన్‌లైన్ మందుల విక్రయాలపై కూడా నిరంతర నిఘా కొనసాగాలి. ప్రతి ఔషధ ప్యాక్‌పై ఉండే బ్యాచ్ నంబర్, తయారీ సంస్థ పేరు, గడువు తేదీ, క్యూఆర్ కోడ్ వంటి వివరాలను వినియోగదారులు పరిశీలించే అలవాటు పెంపొందాలి. వైద్యుల సూచన లేకుండా మందులు కొనుగోలు చేయకుండా ఉండడం కూడా సమాజ ఆరోగ్య భద్రతకు తోడ్పడుతుంది.

పాఠశాలలు, కళాశాలలు, గ్రామస్థాయి ఆరోగ్య కేంద్రాలు, ఫార్మసీ సంఘాల ద్వారా నకిలీ మందులపై విస్తృత ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం అవసరం. అనుమానాస్పద మందులపై వెంటనే అధికారులకు సమాచారం అందించే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. ప్రజల అప్రమత్తత, వైద్యుల బాధ్యత, ఔషధ సంస్థల నైతికత, ప్రభుత్వ కఠిన అమలు---ఈ నాలుగు సమన్వయంతో పనిచేసినప్పుడే నకిలీ మందుల చెలామణీకి శాశ్వతంగా అడ్డుకట్ట వేయగలం. ప్రజారోగ్య రక్షణలో రాజీకి తావులేదనే సంకల్పంతో తెలంగాణ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

# తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులకు ఇండ్లు ఇవ్వాలి!

## - టీయూజేవీ కన్వీనర్ భారత సుదర్శన్ -



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ జులై 21 ;తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులకు శాశ్వత నివాస ఐ ఆరోగ్య భద్రత కల్పించాలని తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల వేదిక కన్వీనర్ భారత సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు 'తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె.కేశవరావును అమరవీరుల స్థూపం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా భారత సుదర్శన్ మాట్లాడుతూ..

తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులుగా తెలంగాణ ప్రజల చిరకాల కాంక్ష అయిన "తెలంగాణ స్వరాష్ట్ర సాధన' ఉద్యమంలో శిఖరాగ్రస్థాయిలో పనిచేసి, తెలంగాణ ఉద్యమంలో మమేకమైన సంగతి అందరికీ తెలిసిందేనని అన్నారు. ఉద్యమ సమయం లో మా ఉద్యోగాలు కోల్పోయి కుటుంబాలు ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నా కూడా మొక్కవోని దీక్షతో పాల్గొన్నామన్నారు. తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులుగా మేము ఆనాడు సమైక్య పాలనలో పోలీసుల నిర్బంధాలతో పాటుగా అనేక ఇబ్బందులను ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎదుర్కొన్నామని ఆవేదన చెందారు. అన్ని పక్షాలు నెత్తిన తడిబట్ట వేసుకొని కూర్చున్నప్పుడు కూడా తెలంగాణ జర్నలుస్టులుగా మేం ఉద్యమ కొలిమిని రగిల్చి 'తెలంగాణ ఉద్యమ పోరాట జ్వాల' ఆరిపోకుండా..ఆగకుండా చేసామన్న విషయం ప్రపంచానికి తెలిసిందేనని సుదర్శన్ అన్నారు.

తెలంగాణ స్వరాష్ట్రం సిద్ధించాక మా తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల కష్టాలు తొలగిపోలేదన్నారు. తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులుగా ముద్రపడ్డ మాకు ఏ సమైక్యాంధ్ర మీడియా సంస్థలు ఉద్యోగాలను ఇవ్వలేదన్నారు. ఫలితంగా తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల కుటుంబాలు అనేక ఇబ్బందులను ఇప్పటికీ ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రభుత్వాలు, రాజకీయ పక్షాలు మమ్మల్ని వాడుకొని నడిరోడ్డుపైన వదిలేసాయని భారత సుదర్శన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కిందిస్థాయిలో పనిచేసిన, చేస్తున్న వందలాది మంది తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులకు ప్రభుత్వాలు ఏమాత్రం న్యాయం చేయలేకపోయాయన్నారు.అన్ని రకాల జీవన సౌకర్యాలను కోల్పోయిన మా తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యతనిస్తూ 'శాశ్వత నివాసం మరియు శాశ్వత ఆరోగ్య భద్రత'లను కల్పించాలని కన్వీనర్ భారత సుదర్శన్ ప్రభుత్వాన్ని కోరారు.

కమిటీని కలిసినవారిలో తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల వేదిక నాయకులు మహేశుని లక్ష్మయ్య నేత, కాసాని శ్రీనివాస రావు, బాయికాడి వెంకట్, వినోద్, శివకోటి, నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ రామకృష్ణ మఠంలో జూలై 24, 25 తేదీలో మంత్ర దీక్షలు



హైద్రాబాద్ జులై 21 ;ఈ నెల జూలై చివరి వారంలో బేలూరు రామకృష్ణ మఠం మరియు రామకృష్ణ మిషన్ అధ్యక్షులు పూజ్యశ్రీ గౌతమానంద జీ మహారాజ్ హైదరాబాద్ రామకృష్ణ మఠం సందర్శిస్తున్న సందర్భంగా మూర్తిత్రయం భక్తులకు జూలై 24 మరియు 25 తేదీలు శుక్ర-శని వారాలు ఉదయం "మంత్ర దీక్షలు" ఇవ్వనున్నారు. హన్మకొండ సేవా సమితి నుండి ఎనమండుగురు భక్తులు సదరు స్వామీజీ నుండి మంత్ర దీక్ష స్వీకరించనున్నారు. దీక్షార్థులు "మూర్తిత్రయ జీవిత చరిత్రలు, కథామృతం" తప్పనిసరిగా చదివి, నియమ-నిబంధనలు పాటించి 23వ తేదీ గురువారం సాయంత్రం లోగా హైదరాబాద్ రామకృష్ణ మఠం చేరుకోవాలని, హైదరాబాద్ రామకృష్ణ మఠంలోనే ఉచిత వసతి-అన్న ప్రసాద సౌకర్యాలు కల్పించ బడుతాయని, ఇతర భక్తులు స్వామీజీ దర్శనం చేసుకోవడానికి, వారి ఆశీస్సులు పొందడానికి 26 వ తేదీ ఉదయం 10 గంటలనుండి అవకాశం కల్పించ బడింది, వారికి అన్నప్రసాద సౌకర్యం ఉంటుందని, మంత్ర దీక్షార్థులు లేదా ఇతర భక్తులు వైరల్ ఫీవర్ లేదా ఇతరత్రా కారణాలతో బాధపడేవారు రాకూడదని, హనుమకొండ సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి తెలియజేశారు.

### భారీగా ఢిల్లీకి చేరుకుంటున్న రైతులు

న్యూఢిల్లీ దేశ రాజధాని ఢిల్లీకి రైతులు పోటెత్తారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద నిరసనకు దిగారు. ప్రతిపాదిత భారత్?అమెరికా వాణిజ్య ఒప్పందంలో భాగంగా తక్కువ ధరకు, సబ్సిడీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను తెరవడాన్ని వ్యతిరేకిస్తున్నారు. మంగళవారం ఉదయం శంభు బార్డర్ (పంజాబ్?హర్యానా సరిహద్దు) వద్దకు రైతులు భారీగా చేరుకున్నారు.

### వర్షాకాలం ..విష సర్పం... అప్రమత్తంగా ఉండాలి

# ప్రొఫెసర్ లిల్లీ మేరి





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ జులై 21 : వర్షాకాలం ప్రారంభమై అడపా దడపా వానలు కురుస్తున్నాయి. దీంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. వేసవిలో నేలలో ఉండిన పాములు ఒక్కసారిగా బయటకు వస్తున్నాయి. పనుల్లో నిమగ్నమైన కర్షకులు వాటిని గమనించకుండా విషపురుగుల కాటుకు గురవుతున్నారు. ఇలాంటి సమయంలో బాధితులకు ధైర్యం చెప్పి ఆసుపత్రికి తీసుకెళ్లాలి, నాటు వైద్యం, మంత్రాలు లాంటివి చేయొద్దని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ లిల్లీ మేరి తెలిపారు.

పాము కాటు మరణాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న పాముకాటు మరణాలలో భారతదేశం లోనే ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది పాము కాటుకు గురవుతుంటే మనదేశంలో 12.5 లక్షల మంది పాము కాటుకు గురవుతున్నారు. వారిలో 60 వేల మంది మృత్యువాత పడుతున్నారని జాతీయ మరణాల సర్వే చెప్తుంది. ఇదే విషయాన్ని హైదరాబాదులోని " సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ సంస్థ" నిరుడు నివేదించింది. ఇండియాలో ప్రధానంగా 60 రకాల విష సర్పాలు మనుగడ సాగిస్తున్నాయి అని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ లిల్లీ మేరి పేర్కొన్నారు న ర్పాలం, విషపురుగులతో జాగ్రత్త, పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదం , వర్షాకాలంలో విష సర్పాలు, పురుగులు సంచారం అధికంగా ఉంటుంది. అవి పెట్రోలు, కిరోసిన్, వెల్లుల్లి, ఇంగువ వాసనను భరించలేవు. వీటిని అశీదు బాటలో ఉంచుకుని సమయానుకూలంగా వినియోగించుకోవాలి. తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే రబ్బరు బూట్లు, చేతి తొడుగులు ధరించాలని, మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ లిల్లీ మేరి తెలిపారు.

పొలం గట్లు, కాలువగట్లు, వాగులు, పశువుల పాకలు, పిచ్చి మొక్కలతో నిండిన పొదులు, గడ్డివాములు , పాడుబడ్డ ఇల్లు, గృహాలు ఎదుటి పేర్చిన కట్టెలు, పెంటకుప్పల్లో పాములు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఆహారం కోసం బయటకు వచ్చి ఎలుకలు, బల్లులు, తొండలు, పక్షులను తింటాయి. ఇలాంటి ప్రాణులు ఎక్కడ ఎక్కువగా సంచరిస్తాయో పాములు అక్కడే తిష్ట వేస్తాయి. పాములకు శరీరం కింద భాగంలో ఉండే ప్రత్యేక పోలుసుల ద్వారా శబ్దం గ్రహిస్తాయి. వేడి రక్తం ప్రసవించే జంతువులు, మనుషులు సమీపిస్తే వెంటనే గుర్తిస్తాయి. కదులుతున్న ప్రాణులను గుర్తించి కాటేస్తాయి. నాగుపాము, కట్లపాము, రక్తపింజర తదితర పాములు విషపూరితమైనవి. వీటి కాటు గురైన బాధితులకు వెంటనే వైద్యమందక ఒక్కొక్కసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. సాధారణంగా పంట పొలాలు, కాలువల్లో తిరిగే పాములు చాలా వరకు విషపూరితమైనవి కావు. సర్పాలకు ప్రాణభయం ఉన్నప్పుడు, ఏకాంతానికి భంగం వాటిలినప్పుడు, ఎవరైనా తొక్కినప్పుడు, వేటాడేటప్పుడు కాటేస్తాయి.

అన్ని ప్రమాదం కావు …

పాముల్లో చాలా వాటికి విషం ఉండదు. కట్లపాము వంటి 15% ప్రమాదకరమైన సర్పజాతుల్లోనే ప్రమాదం ఉంటుంది. సాధారణంగా 60% పాము కాట్లు విషము. ప్రమాదం లేని పాములు గాయాలే . చికిత్స తీసుకుంటే నయమవుతాయి. పాములు కన్నా చాలా మంది షాక్ తో ప్రాణం మీదకు తెచ్చుకుంటారు. ఇంట్లో వారు, ఇరుగుపొరుగువారు ధైర్యం చెప్పడానికి బదులుగా ఏడుపులు ప్రారంభిస్తే బాధితులు భయాందోళనకు గురైతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా తయారవుతుంది.

**తీసుకోవలసిన జాగ్రత్తలు:**

రాత్రి వేళల్లో తిరిగేవాళ్లు, అక్కడే నిద్రించేవాళ్లు, టార్చ్ లైట్లు వెంట తీసుకుపోవాలి. పాములు చేరడానికి అవకాశం లేకుండా పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పెట్రోలు, కిరోసిన్, వెల్లుల్లి, ఇంగువ వాసనలను భరించలేవు. పాములు ఎక్కువగా ఉన్నాయనిపిస్తే సమయాన్నికూలంగా వీటిని ఉపయోగించుకోవాలి. రాత్రివేళలో పొలాల గట్లపై, గడ్డివాముల్లో తిరిగే రైతులు, కూలీలు మోకాళ్ళ వరకు రబ్బరు బూట్లు, చేతులకు రబ్బరు తొడుగులు ధరించాలి. ఇల్లు, కార్యాలయాలు, పాఠశాలలు పరిసరాలలో పిచ్చి మొక్కలు, పొదలు ఉండకుండా చూసుకోవాలి.

**సకాలంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలి: ప్రొఫెసర్ లిల్లీ మేరి**

పాము కాటు గురైన వ్యక్తి ఆందోళన చెందొద్దు, బాధితుడికి ధైర్యం చెబుతుండాలి. పాము కాటేసిన పై భాగంలో వెంటనే తాడు, గుడ్డతో బిగుతుగా కట్టాలి. కాటేసిన చోట బ్లేడుతొ గాయం చేసి రక్తం కారనివ్వాలి . నోటిలో పుండ్లు, గాట్లు లేకుంటే రక్తం పీల్చి ఉమ్మి వేయాలి. పాముకాటుకు గురైన వ్యక్తిని నడిపించడం, పరిగెత్తించడం చేయొద్దు. పాము విషానికి విరుగుడుగా "పాలివేలెంట్ స్నేక్ యాంటీ వీనం" మందు ప్రతి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉంటుందని, పాము కాటుకు గురైన బాధితులకు మొదటి మూడు గంటల లోపు' స్నేక్ యాంటీ వీనం' అందించగలిగితే ప్రాణాపాయం తప్పుతుందని ప్రొఫెసర్ లిల్లీ మేరి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2030 నాటికి పాము కాటు మరణాలను సగానికి పైగా తగ్గించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యమని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ లిల్లీ మేరి తెలిపారు. నాటువైద్యం పేరిట పసర్లు, వేర్లు, మంత్రాలు అంటూ కాలయాపన చేయకుండా వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లాలని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ లిల్లీ మేరి అన్నారు.

# రెండు వర్గాల మధ్య ఘర్షణ ఘటన

## ఇరువర్గాలపై కేసులు నమోదు, బైండ్ ఓవర్ చర్యలు



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జులై 21 ప్రజాబలం:** కొత్తగూడెం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ ఘటనకు సంబంధించి ఇరువర్గాలపై చట్టప్రకారం కేసులు నమోదు చేయడం జరిగింది.

ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి, ప్రజల శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేలా ఇరువర్గాల వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించేందుకు చట్టపరమైన చర్యల్లో భాగంగా ఇరువర్గాల వ్యక్తులను బైండ్ ఓవర్ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా కొత్తగూడెం 3 టౌన్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, వ్యక్తిగత లేదా వర్గాల మధ్య తలెత్తే వివాదాలను చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని పరిష్కరించేందుకు ప్రయత్నించకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలు, గొడవలు, దాడులు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ఎలాంటి చర్యలనైనా పోలీసులు కఠినంగా పరిగణించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.ప్రజలందరూ పరస్పర సహకారంతో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగిస్తూ, చట్టాన్ని గౌరవించి పోలీసులకు సహకరించాలని కొత్తగూడెం 3 టౌన్ పోలీసులు కోరుతున్నారు.

## ఎల్‌నినో నేపథ్యంలో వరి సాగు వద్దు

## ప్రత్యామ్నాయ పంటలే మేలు : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**పెద్దపల్లి జిల్లా, (ధర్మారం), జూలై 21, ప్రజాబలం ప్రతినిధి :**ఎల్‌నినో నేపథ్యంలో వరి సాగు వద్దు, ప్రత్యామ్నాయ పంటలే మేలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని రైతు వేదికలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ



శాఖ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రస్తుత తీవ్ర ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హ పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేస్తోందన్నారు. ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ పేదల ఆత్మగౌరవాన్ని కాపాడటంలో ప్రభుత్వం ఎక్కడా వెనుకడుగు వేయదన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 35 శాతం వర్షపాతం లోటు నమోదైందని, భూగర్భ జలాలు కూడా వేగంగా తగ్గిపోతున్నాయని తెలిపారు. వాతావరణ శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ వరి సాగుపై ఆధారపడకుండా వ్యవసాయ శాఖ సూచించిన కందులు, పెసర్లు, మినుములు, ఇతర పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఉద్యాన పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకుంటే నష్టాలను తగ్గించుకోవచ్చని అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అందిస్తున్న సూచనలను ప్రతి రైతు పాటించాలని, అవసరమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, ప్రభుత్వ సహాయ సహకారాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో జర్నలిస్టులకు సుస్థిర స్థానం

## మునీర్ పుస్తక పరిచయ సభలో చైర్మన్ రాష్ట్ర మీడియా అకాడమీ

## కె. శ్రీనివాస రెడ్డి



**పెద్దపల్లి/గోదావరిఖని, జూలై-21, ప్రజాబలం ప్రతినిధి :** ప్రజల పక్షాన నిలిచి, నిష్పక్షపాతంగా పనిచేసినప్పుడే జర్నలిస్టులకు ప్రజల గుండెల్లో స్థానం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ – గోదావరిఖని సౌజన్యంతో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో మంగళవారం జరిగిన ప్రోలిటేరియన్ జర్నలిస్ట్ మునీర్ బాయ్ పుస్తక పరిచయ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశంలో పెట్టుబడి దారుల చేతుల్లోకి మీడియా రంగం వెళ్లిపోయిందని అన్నారు. గడిచిన 12 సంవత్సరాలలో ప్రధానమంత్రి కనీసం ఒక్క మీడియా సమావేశం కూడా ఏర్పాటు చేయలేదని ఇది ప్రజాస్వామ్యానికి, ప్రజలకు నష్టదాయకమని పేర్కొన్నారు. జర్నలిజాన్ని నమ్ముకుని జీవితాంతం అన్యాయాన్ని, ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, పాలకుల లోపాలను ఎత్తిచూపుతూ ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న జర్నలిస్ట్ మునీర్ జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. నిర్భయంగా, ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా, వాస్తవ సమాచారాన్ని ప్రజలకు అందించడమే జర్నలిస్టుల కర్తవ్యం అని ఆయన ఉద్బోధించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ వలన సమాజంలో నాలుగవ స్తంభంగా నిలబడిన జర్నలిస్టులను, దుకాణాలలో పనిచేసే కూలీలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. జర్నలిస్టుల జీతభత్యాల పెరుగుదలకు మరో సమరశీల పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ప్రధాన పత్రికా రంగంలో వృత్తి నిబద్ధత కోల్పోవడం వలన సోషల్ మీడియాకు ఆదరణ పెరిగిందని తేల్చి చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే కొన్ని కథనాలు వాస్తవానికి దూరంగా ఉంటున్నాయని, వాటిపై ఏలాంటి తనిఖీ, నియంత్రణ లేకపోవడం వల్ల విచ్చలవిడితనం పెరిగిపోతున్నదని దీనిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు మాదాసి రామమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్, రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య ఐజేయు టీయూడబ్ల్యూజే జాతీయ నాయకుడు నగునూరి శేఖర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్ కుమార్ జిల్లా అధ్యక్షుడు మల్లా వజుల వంశీ, గోదావరిఖని ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డి మాధవరావు గడ్డం శ్యామ్ కుమార్, ఇఫ్తా జాతీయ నాయకులు కే స్వామి కార్మిక సంఘాల నాయకులు తుమ్మల రాజిరెడ్డి రియాజ్ అహ్మద్ పర్లపల్లి రవి ఐ కృష్ణ మల్లికార్జున్ శ్రోతులు కె విశ్వనాథ్ తోకల రమేష్ రచయిత నక్క వెంకట్రావు, పుస్తక సమీక్షను హెచ్ రవీందర్ నిర్వహించారు. అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు గాండ్ల శ్రీనివాస్, బక్క రవి, శేఖర్, కోల లక్ష్మణ్, పాలకుర్తి విజయకుమార్, మామిడి సత్యనారాయణ, మనోహర్ రెడ్డి, సుధాకర్ రావు, జేవి రాజు, శ్రీపతి రాజగోపాల్,మైనార్టీ నాయకులు హమీద్, మాల మహానాడు నాయకులు మద్రి ఐలయ్య, పిట్టల వెంకటి, నంది నరేష్, ప్రజానాట్యమండలి కళాకారులు కన్నం లక్ష్మీనారాయణ, చీకటి అంజయ్య, ఎజ్జ రాజయ్య, దయా నర్సింగ్ జనగామ రాయనర్స్ పద్మ, రమ తదితరులు పాల్గొన్నారు

## చీర్లవంచలో ‘డ్రై డే’ను పరిశీలించిన డీఎంహెచ్‌వో



**రాజన్న సిరిసిల్ల జిల్లా జూలై 21 (ప్రజా బలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా చీర్లవంచ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ‘డ్రై డే’ కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా ఇళ్ల పరిసరాలు, నీటి నిల్వ ప్రాంతాలను తనిఖీ చేసిన ఆమె, దోమల లార్వా నిర్మూలనకు నీటి నిల్వల వద్ద ఆయిల్ బాల్స్ ఉపయోగించాలని, ఫాగింగ్ ముమ్మరం



చేయాలని సిబ్బందిని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి మంగళవారం, శుక్రవారం తప్పనిసరిగా ‘డ్రై డే’ పాటించాలని సూచించారు.

ప్రజలు ఇళ్లలోని కూలర్లు, పూల కుండీలు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజన్న సన్నిధిలో అఖిల భారత వేద--స్మార్త పరీక్షా మహోత్సవాలు ప్రారంభం



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, జూలై 21:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖిల భారత వేద--శాస్త్ర--స్మార్త--ఆగమ విద్వత్ సదస్సు, వేద--స్మార్త పరీక్షా మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదాలు సనాతన ధర్మానికి మూలస్తంభాలని, వేద పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జూలై 21 నుంచి 25 వరకు జరిగే ఈ మహోత్సవాల్లో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 170 మందికి పైగా వేద విద్యార్థులు, వేద పండితులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఆలయ ఈవో ఎల్. రమాదేవి, వేద పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయ శర్మ, డీఈఓ నవీన్ కుమార్, ఆలయ అర్చకులు, వేద పండితులు, వేద విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు

## సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల భవనాల నిర్మాణానికి స్థలాల పరిశీలన



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 21:** జిల్లాలో నూతన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలను అధికారులు మంగళవారం పరిశీలించారు.

ఖమ్మం జిల్లా రిజిస్ట్రార్ ఎ. శ్రీనివాస్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు కలిసి ఖమ్మంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వెనుక ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహ స్థలం, ఆర్ అండ్ బి శాఖకు చెందిన స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కేంద్రంలో జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంతో పాటు ఖమ్మం రూరల్, సత్తుపల్లి, కూసుమంచి, వైరా ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు మంజూరయ్యాయని, వాటి భవనాల నిర్మాణం కోసం అనువైన స్థలాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు.

అదేవిధంగా తిరుమలాయపాలెం, మధిర, సింగరేణి, ముదిగొండ మండలాల్లో మంజూరైన తహసీల్దార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి కూడా తగిన స్థలాలను ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ నరేందర్, హౌసింగ్ డీఈ జాగురాం తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులపట్ల నిర్లక్ష్యంపై కలెక్టర్ కఠిన చర్య

## యడవల్లి బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కొండయ్య సస్పెండ్

మార్కాపురం విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి కల్పించడంలో నిర్లక్ష్యం వహించినందుకు యడవల్లి బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కొండయ్యను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ విజయ సునీతఉత్తర్వులు జారీ చేశారు.ఎడవల్లి వార్డెన్ కొండయ్య గిద్దలూరు, కొమరోలు బీసీ హాస్టళ్లకు ఇన్చార్జిగా కూడా ఉన్నారు. అయితే గిద్దలూరు బాయ్స్ హాస్టల్ నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని ఆరోపణలు వచ్చాయి.మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించకపోవడంతో ఆగ్రహించిన విద్యార్థులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. ఈ ఘటనపై వార్తాపత్రికల్లో కథనాలు రావడంతో ఉన్నతాధికారులు స్పందించారు.తనిఖీల్లో బయటపడిన నిజాలుసహాయ బీసీ సంక్షేమ అధికారి హాస్టల్‌లో తనిఖీ చేయగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అనంతరం జిల్లా బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి కూడా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. వసతి గృహంలోని విద్యార్థులు తమకు జరిగిన అన్యాయాన్ని అధికారికి వివరించారు. ఈ మేరకు సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించగా, కలెక్టర్ వెంటనే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.కొండయ్యను విధుల నుంచి విడుదల చేసి అనుమలవీడు వార్డెన్‌గా మురళిను నియమించారు. గిద్దలూరు బీసీ బాయ్స్ హాస్టల్‌అల్లినగరం వార్డెన్ సంగతాల శ్రీనివాసులు ఇన్చార్జికొమరోలు బీసీ హాస్టల్ అదే ప్రాంతంలోని బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ రోజా ఇన్చార్జివిద్యార్థుల సంక్షేమంలో రాజీ లేదని, నిర్లక్ష్యం చేసే అధికారులపై ఇలాంటి కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

## అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో జాప్యం... రోడ్డెక్కిన జర్నలిస్టులు



రాజన్న సిరిసిల్ల ప్రజాబలం దినపత్రిక జూలై 21: అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్ 143) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన "చలో కలెక్టరేట్" కార్యక్రమం విజయవంతంగా జరిగింది. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా జిల్లా నలుమూలల నుంచి



పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు కలెక్టరేట్‌కు చేరుకుని తమ సమస్యలపై గళం విప్పారు. జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామల గట్టు నాయకత్వంలో జరిగిన ఈ ఆందోళనలో జర్నలిస్టులు ప్లకార్డులు ప్రదర్శించారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ వర్షంలోనే నిలబడి నిరసన కొనసాగించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా మాట్లాడుతూ, జిల్లాలో అర్హులైన అనేక మంది జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ కార్డులు లేకపోవడం వల్ల జర్నలిస్టులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అధికారిక గుర్తింపు, రవాణా సౌకర్యాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జాప్యం కారణంగా బస్సు పాస్‌ను ఆరు నెలల కాలంలో పలుమార్లు రెన్యువల్ చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొనడం విచారకరమని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులను ఈ విధంగా ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని పేర్కొన్నారు.

ప్రభుత్వం, సంబంధిత అధికారులు అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించిన ఆయన, వెంటనే పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ధర్నా జరుగుతున్న విషయం తెలుసుకున్న కలెక్టరేట్ అధికారి ఆందోళన స్థలానికి చేరుకుని సంఘం నాయకులతో చర్చించారు. అనంతరం జర్నలిస్టు సంఘం ప్రతినిధుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించి, సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో జర్నలిస్టులు తమ నిరసన కార్యక్రమాన్ని విరమించారు.

ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పరకాల ప్రవీణ్, రేగుల రాంప్రసాద్, రసూల్, సయ్యద్ అలీ, రాపల్లి సంతోష్, సిహెచ్ దేవరాజు, మల్లికార్జున్, కలీం, దేవేందర్, జిల్లా రమేష్, చౌటుపల్లి వెంకటేష్, రియాజ్ గోవిందు వేణు, బట్టు శ్రీనివాస్, ఫహద్, కంటాల విజయ్, పంపరి నాగరాజు, శ్రీకాంత్, రెడ్డి మల్ల సత్యనారాయణ పోతుల గాంధీ బాబు,జింక శ్రీధర్, వసీం, జనగామ రమేష్, పండుగ స్వామి, సలీం, జితేందర్, విష్ణు గంగాధర్, ఆసిమ్, సదుమల్ల తిరుపతి, పరుపుల నారాయణ ప్రసాద్, సత్యం, రెడ్డి మల్ల నరసయ్య, కృష్ణ, అజర్, గడ్డం రవి, సంతోష్ తదితర పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పట్లూర్ జనగణన సర్వే 100% నమోదు చేసుకోవాలి గ్రామ సర్పంచ్ పరుశురాం



వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూలై 21 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలో ఎస్ ఐ ఆర్ సర్వేలో పాల్గొన్న ఎంపీడీవో శాంతమ్మ, ముఖ్యంగా గ్రామ ప్రజలు వివిధ గ్రామాల్లో జీవనోపాధి కొరకు వెళ్ళినవారు కానీయండి గ్రామ ప్రజలు కానివ్వండి ప్రతి ఒక్కరు సర్వేలో పూర్తిస్థాయి వివరాలతోనివేదిక అధికారులకు సమర్పించాలని గ్రామ సర్పంచ్ పరిశ్రమ తెలిపారు అటు ఇటు కాకుండా మన స్వగ్రామంలో మన సర్వేలో నమోదు చేయించుకుని ప్రభుత్వం నుండి వచ్చే నిధులు గాని సంక్షేమ పథకాలు కానీయండి అభివృద్ధి కానీయండి ప్రతి విషయంలో మన గ్రామ ప్రజలకు మన గ్రామ సహకారం ఉంటుంది కాబట్టి ప్రతి ఒక్కరు పూర్తి వివరాలతో సర్వే నివేదిక సమర్పించాలని గ్రామ సర్పంచ్ పరుశురాం

## ఉద్యమకారుల గుర్తింపులో జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి

### – టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 21:తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన మహా ఉద్యమంలో, క్రియాశీలక పాత్రను పోషించిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించి, వారి సేవలకు, త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ కోరారు.

మంగళవారం నాడు ట్యాంక్ బండ్ లోని తెలంగాణ అమర జ్యోతిలో, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం, సంక్షేమంపై, జర్నలిస్టులతో ఉద్యమ గుర్తింపు కమిటీ నిర్వహించిన సంప్రదింపుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, ఉద్యమ సమయంలో జర్నలిస్టులు కేవలం వార్తలను సేకరించి ప్రచారం చేసే బాధ్యతకే పరిమితం కాలేదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను, ఆవేదనను, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి తెలియజేస్తూనే, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను, వాస్తవాలను ప్రజలకు చేరవేసి ఉద్యమానికి నైతిక బలం చేకూర్చడం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తించారని ఆయన అన్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న వివక్షను, సామాజిక–ఆర్థిక అసమానతలను, ప్రాంతీయ అన్యాయాలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకువచ్చారన్నారు. అనేక ప్రాంతాల్లో జర్నలిస్టులు ఉద్యమకారులతో కలిసి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని, పలుచోట్ల ఉద్యమ జాయింట్ యాక్షన్ కమిటీలకు నాయకత్వం వహించారని ఆయన గుర్తుచేసారు. ఉద్యమ సమయంలో పోలీసులు జర్నలిస్టులపై లాఠీచార్జీలు జరిపిన సంఘటనలు ఎన్నో చోట్ల చోటుచేసుకున్నాయని, ఉద్యమానికి కేంద్రంగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీతో పాటు పలు చోట్ల పోలీసులు కెమెరాలను ధ్వంసం చేయడం, వార్తా సేకరణను అడ్డుకోవడం, జర్నలిస్టులపై తప్పుడు కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, గాయపర్చడం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. అయినప్పటికీ విధినిర్వహణలో జర్నలిస్టులు వెనుకడుగు వేయలేదని, తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను నిర్వర్తించారన్నారు. అలాగే ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నందుకు పలువురు జర్నలిస్టులు తమ ఉద్యోగాలను కూడా కోల్పోయారని, కొందరు యాజమాన్యాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నారని, మరికొందరు తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇచ్చినందుకు ఉద్యోగాలకు రాజీనామా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, అయినా వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి తెలంగాణ సమాజం కోసం తమ జీవితాలను అంకితం చేశారని విరాహత్ తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఎంపిక కమిటీ ఈ అంశాన్ని సానుభూతితో పరిశీలించి, ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని సేవలందించిన జర్నలిస్టులకు ఉద్యమకారులుగా గుర్తింపు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రలో జర్నలిస్టుల సేవలు, త్యాగాలు చిరస్థాయిగా నిలిచేలా కమిటీ న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు. ఈ సందర్భంగా యూనియన్ వినతిపత్రాన్ని కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, రాములు నాయక్, శోభన్ రెడ్డిలకు అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## నీటి సంరక్షణ పనులు ముమ్మరంగా చేయాలి

**. ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలి**

**. ఇందిరమ్మ ఇండ్లలో స్థాయిల వారీగా పురోగతి ఉండాలి**

**. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై –21( ప్రజాబలం ప్రతినిధి )జిల్లావ్యాప్తంగా నీటి సంరక్షణ పనులు ముమ్మరంగా చేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తెలంగాణ జలసిరి, ఇందిరమ్మ ఇండ్లపై హౌసింగ్ ఏఈలు, ఎంపీడీఓలు, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయని తెలిపారు. భవిష్యత్తు అవసరాలు,పంటల సాగు, తాగునీరు,భూగర్భ జలాల వృద్ధి కోసం వర్షం నీటిని ఒడిసి పట్టాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ జలసిరి కింద

జల సంరక్షణ కోసం చేపట్టనున్న పనులు, లాభాలపై టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇంకుడు గుంతలు, పంట కుంటలు (పామ్ పాండ్), ఊట కుంట (పర్కొలేషన్ ట్యాంక్), బోరు బావుల రీచార్జ్ పనులు జిల్లాలోని మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టి.. పూర్తి చేయాలని ఆదేశించారు. ఫాం పాండ్స్ తో రైతుల పొలాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని, ఎన్నో లాభాలు ఉన్నాయని తెలియజేస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫాం పాండ్స్, బోర్ వెల్స్ రీచార్జ్ పనులు చేసుకునేలా చూడాలని సూచించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ, ప్రజల బోర్ వెల్స్ రీచార్జ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. బోర్ వెల్స్ రీచార్జ్ తో భూగర్భ జలాలు పెరిగి నీటి ఇబ్బందులు దూరమవుతాయనే విషయాన్ని తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే నీటి వృథాను అరికట్టాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలి. క్షేత్రస్థాయిలో సమగ్ర ప్రణాళిక రూపొందించుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో మొదటి దశలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రస్తుత పరిస్థితి, ఇప్పటివరకు ప్రారంభమైన నిర్మాణాలు, వివిధ దశల్లో ఉన్న ఇండ్లు, పూర్తయిన ఇండ్ల వివరాలను మండలాల వారీగా అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. రెండో దశలో మంజూరు చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి చేపడుతున్న ప్రక్రియ, లబ్ధిదారుల ఎంపిక, అర్హత కలిగిన లబ్ధిదారుల వివరాలను ఆరా తీశారు. మొదటి దశలో మంజూరైన ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, నిర్మాణ సామగ్రి తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ, వారికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ప్రతి మండలంలో ఇండ్ల నిర్మాణాల పురోగతిని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. స్పష్టమైన కార్యాచరణ, ప్రణాళిక రూపొందించుకుని ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు వేగంగా పూర్తి చేసుకుంటే కలిగే లాభాలపై లబ్దిదారులకు వివరించాలని తెలిపారు. గుడిసెలు, రేకుల షెడ్లలో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, అధికారులు ఉన్నారు.

## సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి అధికారులకు విప్ ఆది శ్రీనివాస్ ఆదేశం



వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, జూలై 21: వేములవాడ నియోజకవర్గంలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు.

మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ గ్రాంట్లు, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్, డీఎంఎఫ్‌టీ, ఈజీఎస్, సీఆర్ఆర్ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపడుతున్న పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను ఆలస్యం చేయకుండా వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పనులు ఎక్కడ జాప్యం అవుతున్నాయో గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా ప్రతి పనిని సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరు తాయని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సమావేశంలో సిరిసిల్ల ఈఈ సుదర్శన్ రెడ్డి, వేములవాడ డీఈ విష్ణువర్ధన్, చందుర్తి డీఈ పవన కుమారి, కోరుట్ల డీఈ సత్యనారాయణ, ఏఈలు మనోహర్, అంజయ్య, సాయి తేజ, జగదీశ్, సుచరిత్ తదితరులు పాల్గొన్నారు.

## సిక్కింలో ఘోర ప్రమాదం

గ్యాంగ్ టక్ సిక్కిం లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నమాచిలోని హైడ్రో ప్రాజెక్టు టన్నెల్లో 27 మంది కార్మికులు చిక్కుకున్నారు. వారిని ఏడుగురు మృతి చెందారు. టన్నెల్లో పని చేస్తుండగా కొండచరియలు విరిగిపడి ప్రవేశ ద్వారం మూసుకుపోయింది. టన్నెల్ లో మీథేన్ వాయువు విడుదల కావడంతో సహాయక చర్యలకు ఇబ్బందిలు ఏర్పడ్డాయి. టన్నెల్లో చిక్కుకున్న వారిలో ఏడుగురు మృతి చెందినట్లు అధికారులు ధృవీకించారు. మిగతా కార్మికుల కోసం సహాయక చర్యలు యుద్ధప్రాతిపాదికన కొనసాగుతున్నాయి.

# విద్యార్థులపై లాఠీచార్జ్ ఖండనీయం: నరేష్ గౌడ్



**జహీరాబాద్, జూలై 21 ప్రజాబలం ప్రతినిధి:** ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అత్యంత బాధాకరమని తెలంగాణ యూత్ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్ పేర్కొన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు.నీట్ పేపర్ లీకేజీపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేపడుతున్న ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం పోలీసులను ఉపయోగిస్తోందని ఆరోపించారు. లాఠీ దెబ్బలతో విద్యార్థుల ఉద్యమాన్ని ఆపలేరని, ప్రశ్నించే యువతపై దాడులు చేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే వరకు యువజన కాంగ్రెస్ వారి పక్షాన నిలిచి పోరాటం కొనసాగిస్తుందని నరేష్ గౌడ్ స్పష్టం చేశారు.

# వృక్ష సంపదను కాపాడుదాం.. ప్రకృతిని పరిరక్షిద్దాం: సర్పంచ్ రాజ్‌కుమార్



**కోహిర్, జూలై 21 ప్రజాబలం ప్రతినిధి:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రకృతిని కాపాడాలంటే ప్రతి వ్యక్తి కనీసం మూడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోహిర్ మండలం మనియర్‌పల్లి గ్రామ సర్పంచ్ బాగారి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం కూడా ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం చేపడుతున్న హరితహారం, వనమహోత్సవం వంటి కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.గ్రామంలోని రహదారుల వెంట, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటి పెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, యువకులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు.

# భూ భారతి రీ సర్వేపై గ్రామసభ నిర్వహణ




**జహీరాబాద్, జూలై 21 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మండలం తమ్మడపల్లి గ్రామంలో మంగళవారం భూ భారతి రీ సర్వే కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ ఆర్డీవో దేవజ, తహసీల్దార్ దశరథ్ హాజరై రైతులకు రీ సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆర్డీవో దేవజ మాట్లాడుతూ.. భూ భారతి రీ సర్వే ద్వారా భూ రికార్డులు పారదర్శకంగా, కచ్చితంగా నమోదు అవుతాయని తెలిపారు. సర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలను సిద్ధంగా ఉంచి రెవెన్యూ అధికారులకు సహకరించాలని సూచించారు. భూ హద్దులు, రికార్డులకు సంబంధించిన ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు ఉంటే గ్రామసభలోనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.తహసీల్దార్ దశరథ్ మాట్లాడుతూ, రీ సర్వే ప్రక్రియను విజయవంతం చేయడంలో రైతుల సహకారం ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని భూ రికార్డులను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, రైతులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# "స్టేట్స్ మెన్ ఎక్స్ లెన్స్" అవార్డు కు శ్రీకారం చుట్టిన "లార్వేన్ క్రాఫ్ట్స్ సంస్థ".




**హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రజాబలం ప్రతినిధి:** మునుపెన్నడూ లేని విధంగా సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి ప్రజా సంక్షేమం కోసం పాటుపడి విశిష్ట సేవలు అందించిన రాజకీయ ఉద్దండులకు అవార్డులను ప్రధానం చేసి సత్కరించుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది "లార్వేన్ క్రాఫ్ట్స్ సంస్థ". ఈ సంస్థ ద్వారా "స్టేట్స్ మెన్ ఎక్స్ లెన్స్" అవార్డు పేరుతో 65ఏళ్ళ పైబడిన ఎంపిక చేసిన రెండు తెలుగు రాష్ట్రాలకు సంబందించిన నాయకులకు అవ్వార్ధులు ప్రధానం చేయనున్నారు.

ఈనెల 25 వ తేదీన లార్వేన్ క్రాఫ్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో స్టేట్స్ మెన్ ఎక్స్ లెన్స్ అవార్డుల కార్యక్రమానికి సంబంధించిన కాంక్లేవ్ నిర్వహించనున్నారు. దీనికి సంబందించిన పోస్టర్ ను సోమాజిగూడ లోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం ఆ సంస్థ గౌరవ సలహాదారు, సీనియర్ పాత్రికేయులు, మాజీ ఆర్టీఐ కమిషనర్ శ్రీ విజయ్ బాబు గారి ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శ్రీ విజయకుమార్ రెడ్డి గారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన పోస్టర్ ను ఆవిష్కరించారు. విశిష్ట అతిధులుగా మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, హైడ్రా పిఆర్ఓ శ్రీ వేణుగోపాల్ నాయుడు గారు మరియు తెలంగాణ మాస పత్రిక ఎక్సిక్యూటివ్ ఎడిటర్ శ్రీ కోడూరి శ్రీనివాస్ రావ్ గారు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ రాజకీయ నాయకులకు అవార్డులు ప్రధానం చేయడం శుభసూచకమని, భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అన్నారు. ఇంతటి సాహసోపేతమైన కార్యక్రమానికి పూనుకున్న లార్వేన్ క్రాఫ్ట్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శివాల గిరిబాబు గారిని అతిధులు అభినందించారు. అదే విధంగా లార్వేన్ క్రాఫ్ట్స్ సంస్థ క్రియేటివ్ డైరెక్టర్ సుధాజైన్ గారు, నిర్వహణ కమిటీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి గారు మరియు కార్యనిర్వహణ హెడ్స్ నాగేష్, చంద్రశేఖర్ లు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న జరిగే "జైల్ భరో" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

## -వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాంచందర్




**జహీరాబాద్, జూలై 21 ప్రజాబలం ప్రతినిధి:** ఆగస్టు 10న నిర్వహించనున్న "జైల్ భరో" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బి. రాంచందర్ పిలుపునిచ్చారు.జహీరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలను విరమించి, గ్రామీణ పేదలకు ఉపాధి హక్కును పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే వీబీజీ రాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు.

ఉపాధి హామీ కార్మికులకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని,కనీస వేతనాలు రోజుకు 800 రూపాయలు చెల్లించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోర్డులు తేవడాని వ్యతిరేకిస్తున్నాం అన్నారు. రైతంగానికి గిటిబాటు ధరలు ఇవ్వాలని, ఈ డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 10న నిర్వహించే "జైల్ భరో" కార్యక్రమంలో కార్మికులు, రైతులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశానికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జహీరాబాద్ మండల అధ్యక్షులు సుకుమార్ అధ్యక్షత వహించారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి పాస్తాం తుల్జారాం,రిపోర్ట్ ను ప్రవేశపెటిన్నారు. ఈ కార్యక్రమములో నాయకులు నర్సింలు, సంజీవ్, నవీన్, బుద్ధు, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆహార భద్రత చట్టం సవరణలు విరమించుకోవాలి, ఆర్డీవోకు వినతి



**జహీరాబాద్, జూలై 21 ప్రజాబలం ప్రతినిధి:** జాతీయ ఆహార భద్రత చట్టానికి ప్రతిపాదించిన సవరణలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, అలాగే 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర వికలాంగుల సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జహీరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి దేవుజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ, ప్రస్తుతం అమలులో ఉన్న అంత్యోదయ రేషన్ కార్డు ద్వారా కుటుంబ సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా 35 కిలోల బియ్యం అందుతుండగా, దానిని వ్యక్తికి 7 కిలోలకే పరిమితం చేసే ప్రతిపాదన వికలాంగులు, పేద కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా వికలాంగులు, పేదలకు అంత్యోదయ రేషన్ కార్డులు కొనసాగించాలని డిమాండ్ చేశారు.అలాగే 2016 ఆర్‌పిడీ చట్టంలోని సెక్షన్--66 ప్రకారం ఏర్పాటు చేయాల్సిన రాష్ట్ర వికలాంగుల సలహా మండలి కాలపరిమితి ముగిసి నాలుగేళ్లు గడిచినా ప్రభుత్వం కొత్త మండలిని ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. వికలాంగుల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక భద్రత తదితర అంశాల అమలును పర్యవేక్షించేందుకు రాష్ట్ర వికలాంగుల సలహా మండలిని తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో హైమద్, ఎం రాజ్ కుమార్, అంజద్, మచ్చేందర్, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

# 18 నెలల కొడుకును కొట్టి హత్య చేసిన తండ్రి అరెస్ట్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 21 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** జోగిపేట సిఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ,పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో నివాసంఉంటున్న కృష్ణ, గౌరమ్మ,లు గత సంవత్సరం క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారని, వీరికి కుమారుడు జన్మించాడు పుట్టిన 18 నెలలకు నాకు పోషించడం కష్టంగా ఉందని అలాగే భార్య నాకు వంట చేయడం లేదని, బాబును అమ్మేస్తా అని, కృష్ణ,చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరగడంతో కోపంతో కన్న కొడుకును కాళ్లు పట్టుకొని మంచంకు వేసి కొట్టడంతో, బాబు స్పృహ తప్పడంతో, తల్లి పక్కింటి కవిత,ను పిలిచి హుటా హుటినా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లడంతో, డాక్టర్లు బాబు పరిస్థితిని చూసి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో మార్గమధ్యలోనే బాబు చనిపోయాడని, జోగిపేట సిఐ అనిల్ కుమార్, మరియు ఎస్సై గిరి శ్రీకాంత్ చెప్పడం జరిగింది, నిందితుడైన కృష్ణను, జోగిపేట బస్టాండ్ లో పోలీసులు అదుపులోకి తీసుకొని, అనంతరం అతనిపై హత్య కేసు నమోదు చేసి, రిమాండ్ కు తరలించారు...

# ఓటర్ జాబితా సవరణకు అనూహ్య స్పందన



**గండిపేట ప్రజాబలం ప్రతినిధి 21 జులై 2926**మణికొండ, నెక్నంపూర్ ప్రజల సహాయార్థం భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు చేపట్టిన ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) తోడుపాటుకు మంగళవారం రోజున మణికొండ క్వార్టర్ వద్ద ప్రజల నుండి అనూహ్య స్పందన వచ్చిందని గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, జ్ఞానేశ్వర్, భానుచందర్, దేవి ప్రియ, ఆరిఫ్ మహమ్మద్, ముత్తశీగి లక్ష్మయ్య, సచిన్, ఉప్పల్ స్వామి, దీపక్ సింగ్ లు తెలుపుతూ ఈ సందర్భంగా విచ్చేసిన ఓటరులకు సంపూర్ణ మద్దతుతో బి.ఎల్.ఒ ల వద్ద ఉన్న ఫారమ్ తీసుకోడానికి, ఇబ్బందులకు గురి కాకుండా వాటిని పూరించడానికి, ప్రతి ఓటర్ 2002 లోని తమ ఓటు లేదా తమ పెద్దల ఓటుతో ప్రస్తుత ఓటును జత కలుపడం (మ్యాపింగ్ చేసుకొవడం) లో తమ వంతు సహకారం అందించామనీ నిర్వహకులు తెలిపారు.





# అక్రమ ఇసుక తవ్వకాలపై బీఆర్ఎస్ నిరసన



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 21 ప్రజాబలం:**మధిర పట్టణంలోని వైరా నది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ప్రొక్లెయిన్‌లతో అక్రమంగా ఇసుక తవ్వి లారీల ద్వారా తరలిస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ ఆధ్వర్యంలో వైరా నదిలోనే లారీలను అడ్డుకొని ఆందోళన నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి పేరుతో అవినీతి జరుగుతోందని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాలనలో నదిలో భారీగా అక్రమ ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. రాయపట్నం బ్రిడ్జి సమీపంలో సుమారు 20 అడుగుల లోతులో గుంతలు తీసి మట్టి, ఇసుకను తరలిస్తున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వైరా నదిపై నిర్మించిన చెక్‌డ్యామ్ వల్ల మధిర ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగాయని, ఇప్పుడు ఆ చెక్‌డ్యామ్‌కు నష్టం కలిగించేలా చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. చెక్‌డ్యామ్‌ను దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు.

మధిరలో అభివృద్ధి పేరిట జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, వైరా నదిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# 10 వేల మొక్కలతో ఘనంగా మాస్ ప్లాంటేషన్ డ్రైవ్



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 21:** బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ ఆదేశాలు, సింగరేణి యాజమాన్య సూచనల మేరకు సత్తుపల్లి ఏరియా జేవీఆర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు పార్కింగ్ యార్డ్‌లో మంగళవారం భారీ స్థాయిలో 'మాస్ ప్లాంటేషన్ డ్రైవ్' నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏరియా వ్యాప్తంగా 10 వేల మొక్కలను నాటారు.

సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జీఎం చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ, బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సింగరేణి సంస్థకు అత్యంత కీలక బాధ్యత అని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ వృక్షారోపణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి సత్తుపల్లి ఏరియాను మరింత హరితమయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏరియా, ప్రాజెక్టు అధికారులు, ఫారెస్ట్రీ, పర్యావరణ విభాగాల ప్రతినిధులతో పాటు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్. సుధాకర్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు, సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ డి. రమేష్‌బాబు పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో యాజమాన్యంతో కలిసి తాము కూడా ఎల్లప్పుడూ ముందుంటామని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు.

# ప్రకటనలు గొప్ప ఆచరణలో శూన్యం

## కుదేల్లయిపోతున్న చేతి వృత్తి కుటుంబలు



**చంద్రుగొండ జులై 21ప్రజబలం ప్రతినిధి:-** పల్లె కన్నీరు పెడుతుంది కనిపించని కుట్రల వల్ల అనేటువంటి అంశాలని తెలియజేస్తూ ఉంటారు నాయకులు.అనబడేటువంటి వారు అనేటువంటి విషయాన్ని ప్రజలు గమనించాలి. పల్లె ప్రాంతాల అభివృద్ధి కోసం "గ్రామీణ అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేయబడింది"గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం అని చెబుతూ ఇందులో పని చేస్తున్నటువంటి ఉద్యోగస్తులు వారి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించకపోవడం వలన గ్రామీణ ప్రాంతం అభివృద్ధి చెందలేదు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్థికపరమైన ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు,అనే వాస్తవాన్ని గమనించాలి. పల్లె ప్రాంతం మొత్తం వ్యవసాయ ఆధారిత కుటుంబాల పైన, చేతివృత్తుల కుటుంబాల పైన ఆధారపడి జీవిస్తున్నటువంటి అంశం బహిరంగ రహస్యమే. మరి ఈ రైతుల సంక్షేమం కోసం కేటాయించబడుతున్నటువంటి నిధులు ఎందుకు రైతులకు సక్రమంగా చేరడం లేదు అని ప్రశ్నించవలసిన వ్యవసాయ శాఖకు సంబంధించిన ఉద్యోగస్తులు బాధ్యతారాహితంగా విధులు నిర్వహిస్తూ క్రాప్ లోన్ అగ్రి అన్సిలరీ, అగ్రి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ కోసం కేటాయించబడుతున్న నిధులు 100% రైతాంగానికి అందించడంలో వీరు విఫలమవుతున్నారు. కానీ ఈ అధికారులకు మాత్రం జీతభత్యాలు ప్రతినెలా 100% అందుతున్నాయి,అనే వాస్తవాన్ని రైతులు రైతుల సంక్షేమం కోరుకునేవారు గమనించాలి. చేతి వృత్తుల ఆర్థిక అభివృద్ధి కోసం కేటాయించబడుతున్న ఎం ఎస్ ఏం ఇ (మీవీజు) చేతివృత్తులకు అందించడంలో జిల్లా పరిశ్రమల అధికారులు బాధ్యతారాహిత్యంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ కారణం వలన చేతివృత్తుల కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతూ ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. అనే వాస్తవాన్ని కూడా జిల్లా ప్రజలు జిల్లా నాయకులు గమనించాలి. ఈ విషయాలను మండల సర్వసభ్య సమావేశాల్లో మాట్లాడవలసినటువంటి ఎంపీటీసీ, జడ్పీ సమావేశాల్లో మాట్లాడాల్సిన వారు ప్రేక్షకు పాత్ర పోషించడం, గ్రామ సభలో మాట్లాడవలసి వారు మౌనం వహించుట వల్లనే వివిధ రకాల కుట్రలతో పల్లె ప్రాంతం కన్నీరు పెడుతూ అర్థాకలితో ఆవేదనతో ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడింది.అనే బహిరంగ రహస్యాన్ని అందరూ గమనించాలి. జిల్లా ప్రజల అభివృద్ధి కోరుకునే వారు తప్పనిసరిగా "జిల్లా యాక్షన్ ప్లాన్" ప్రకారం కేటాయించబడుతున్న నిధుల వివరాల పైన అవగాహన పెంచుకోవాలి ఈ నిధులు జిల్లా సక్రమంగా ప్రజలకు అందించే దిశగా తీర్మానాలు చేయాలి. స్థానిక ప్రజా ప్రతినిధులు "కమిషన్" కోసం కాకుండా కల్మషం లేని మనసుతో "సమాజ హితం" కోసం ఆలోచించాలి. "విందులు, వినోదాల" కోసం కాకుండా "విప్లవాత్మక" నిర్ణయాల కోసం స్థానిక ప్రజా ప్రతినిధులు పనిచేయాలి. ప్రజా ప్రతినిధులు లంచాల కోసం కాకుండా లక్ష్యం కోసం పని చేయాలి. ప్రజా ప్రతినిధులు సంబరాల కోసం కాదు సమాజ హితం కోసం పని చేయాలి



# సత్తుపల్లి పురపాలక సంఘం సమీక్ష సమావేశం

## వర్షాలు -- తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి



**సత్తుపల్లి ప్రజాబలం ప్రతినిధి జూలై 21:** సత్తుపల్లి పురపాలక సంఘం పరిధిలో వర్షాకాల పరిస్థితులు, తాగునీటి సరఫరాపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పురపాలక సంఘం చైర్‌పర్సన్ రిహాన కమల్ పాషా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో ఖరీఫ్ సీజన్‌లో వరి సహా ఇతర పంటల సాగు పరిస్థితులు, పట్టణంలో తాగునీటి సరఫరా అంశాలపై విస్తృతంగా చర్చించారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం సెప్టెంబర్ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ, భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో నీటి వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ నీరు, బోరు నీటిని పొదుపుగా వినియోగించాలని చైర్‌పర్సన్ రిహాన కమల్ పాషా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో కౌన్సిలర్లు మహమ్మద్ నసీమ్, బండారు శరత్ చంద్ర, జగన్నాథం శ్రీను, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, విరివాడ అప్పారావు, మున్సిపల్ కమిషనర్ కె. నర్సింహ, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసేగుంట సర్పంచ్‌కు షోకాజ్

**జహీరాబాద్, జూలై 21 ప్రజా బలం ప్రతినిధి:** జహీరాబాద్ మండలంలోని ఆసేగుంట గ్రామ సర్పంచ్ పొగాకు నరేష్ కుమార్ కు జిల్లా పంచాయతీ అధికారి షోకాజ్ నోటీసు జారీ చేశారు. 2023--24లో సీసీ రోడ్ల పనులకు సంబంధించిన రూ.7.73 లక్షల బిల్లులు పనులు పూర్తయినప్పటికీ చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, లేకుంటే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసులో హెచ్చరించారు.

## 108 అంబులెన్స్‌లో పాము కాటు విరుగుడు మందు లేదు

## ఖమ్మం జిల్లా 108 ఈఎంఈ ఆలేటి ప్రణయ్



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై21ప్రజాబలం:**సోషల్ మీడియాలో 108 అంబులెన్స్‌లో పాము కాటు విరుగుడు (యాంటీ స్నేక్ వెనం) మందు అందుబాటులో ఉందంటూ వైరల్ అవుతున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని ఖమ్మం జిల్లా 108 ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఆలేటి ప్రణయ్ తెలిపారు.

పాము కాటు విరుగుడు మందును నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో, అవసరమైన అత్యవసర వైద్య సదుపాయాలు ఉన్న ఆసుపత్రుల్లో మాత్రమే అందిస్తారని ఆయన వివరించారు. ఈ మందు ఇవ్వడం వల్ల కొంతమందిలో తీవ్రమైన అలర్జీ ప్రతిచర్యలు (అనాఫైలాక్సిస్) వచ్చే అవకాశం ఉండటంతో, వాటిని ఎదుర్కొనే సదుపాయాలు ఆసుపత్రుల్లోనే ఉంటాయని చెప్పారు.

108 అంబులెన్స్ సేవల ప్రధాన ఉద్దేశం బాధితులకు తక్షణ ప్రాథమిక చికిత్స అందించి, వీలైనంత త్వరగా సమీపంలోని సరైన వైద్యసదుపాయం ఉన్న ఆసుపత్రికి సురక్షితంగా తరలించడమేనని స్పష్టం చేశారు.

ఆరోగ్యానికి సంబంధించిన ఇటువంటి సమాచారాన్ని సోషల్ మీడియాలో చూసిన వెంటనే నమ్మడం లేదా ఇతరులకు షేర్ చేయడం కాకుండా, ప్రభుత్వ ఆరోగ్య శాఖ లేదా వైద్య నిపుణుల ద్వారా ధ్రువీకరించుకోవాలని ఖమ్మం జిల్లా 108 ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఆలేటి ప్రణయ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

## సి.ఎస్ సంజయ్ జాజు.



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, జూలై 21 : రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఎకో టూరిజం అభివృద్ధి, పులుల సంరక్షణ, టైగర్ రిజర్వుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమావేశంలో అటవీ శాఖ, పర్యాటక శాఖ సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సి.ఎస్ కు వివరించారు. ఈ సందర్భంగా సి.ఎస్. మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎకో టూరిజం ను అభివృద్ధి పరచి తద్వారా యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పించడంతో పాటు పర్యటక రంగం ద్వారా రాష్ట్ర ఆదాయం పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. ప్రత్యేకంగా భద్రాచలం పరిసర ప్రాంతాలలో ఉన్న కిన్నెరసాని, శ్రీశైలం నల్లమల అటవీ ప్రాంతాలలో అమ్రాబాద్, గోదావరి నది తీర ప్రాంతంలో ఉన్న కవ్వాల్ టైగర్ రిజర్వు, ఆదిలాబాద్, ములుగు ప్రాంతాలలో ఎకో టూరిజం అభివృద్ధికి తగు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాల ద్వారా రాష్ట్రానికి కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకొని ఎకో టూరిజం ను అభివృద్ధి చేయాలని అన్నారు. రాష్ట్రంలో విలువైన అటవీ సంపద ఉందని, జీవ వైవిధ్యం, సహజ ప్రకృతి అందాలను పర్యాటక అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం అభివృద్ధికి పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా ప్రాజెక్టులు రూపొందిస్తే , ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జి.డి.పి ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు.

ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్, టూరిజం డెవల్మెంట్ కార్పొరేషన్ సంయుక్త భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సి.ఎస్ సూచించారు. ముఖ్యంగా ఫ్యూచర్ సిటీ , అనంతగిరి ,వికారాబాద్,సిటీ అర్బన్ ప్రాంతాలలో ఎకో టూరిజంను ప్రోత్సహించాలని అన్నారు. అటవీ ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, నిబంధనలకు అనుగుణంగా పర్యాటక మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, రాజశఖీ వినయ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కొండాయి జంపన్న వాగులో పోటెత్తిన వరద నీరు

## ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిపివేత



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 21**ములుగు జిల్లా ఏటూరు నగరం మండల కేంద్రంలోని దొడ్ల కొండాయి గ్రామాల మధ్య ఉన్న జంపన వాగు లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జంపన్న వాగులోకి నీరు చేరడంతో తాత్కాలికంగా వేసిన రోడ్డు వరద నీటికి కుట్టుకుపోవడం తో ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు అత్యవసరంగా ఓటును ఏర్పాటు చేసిన ఐటీడీఏ పీవో వరద ముప్పుతో ఐదు గ్రామాల ప్రజలు ఆహార ధాన్యాల కోసం నిత్యవసర సరుకుల కోసం ఆరోగ్య పరీక్షల కోసం ఇబ్బంది కలుగుతుందని ప్రజలు వాపోయారు

## నడిరోడ్డు మీదనే గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది నిద్ర

విజయవాడ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయం ముందు అవుట్ సోర్సింగ్ సిబ్బంది రోడ్డు మీదే పడుకున్నారు. తమకు ఉద్యోగాలు కల్పించాలని గత నెల రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పందన కరువు అయింది. తేల్చుకోనే వెళ్తామని ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయం గెట్ ముందే టీచర్స్ నిద్ర పోతున్నారు. రోడ్డుమీద పడుకున్న వారిలో ఎక్కువ మంది మహిళ టీచర్లే వున్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షకుడు

## మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 21**అణగారిన వర్గాల గర్వకారణం ఖర్గే కి జన్మదిన శుభాకాంక్షలు.

దేశ రాజకీయాల్లో స్ఫూర్తిదాయక నాయకుడు మల్లికార్జున ఖర్గే.

మంత్రి సీతక్క గారి ఆదేశాల మేరకు, పైడాకుల అశోక్ సూచనల మేరకు, ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మండల అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్ మాట్లాడుతూ, సాధారణ కుటుంబం నుంచి ఎదిగి దేశ అత్యున్నత రాజకీయ స్థాయికి చేరుకున్న మల్లికార్జున ఖర్గే గారు అణగారిన వర్గాలకు స్ఫూర్తిదాయక నాయకుడని కొనియాడారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఖర్గే గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు...

ప్రజల పట్ల అంకితభావంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తున్న ఖర్గే ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న,జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు,బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు,మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, మాజీ జడ్పీటీసీ ఎండీ సలీం –వలియాభి, టౌన్ అధ్యక్షులు కే రంజిత్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్,జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సర్వ అక్షిత్,జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్,సర్పంచులు చిన్నన్న, అట్టెం రాంబాబు, ఈసం జనార్దన్,శివాలయం చైర్మన్ మాడుగురి ప్రసాద్,మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సర్వ సాయి,టౌన్ ఉపాధ్యక్షులు మామిడి రాంబాబు,మాజీ టౌన్ అధ్యక్షులు తాళ్లపెల్లి నరేందర్,కే రతన్,పడిదల హన్మంత్,ఇర్సవడ్ల కిరణ్,గంపల శివ,బంటు ఉదయ,బి మంజుల,లచెన్నేం ఎల్లయ్య,పొలబోయిన గోపాల్, నగవత్ కిరణ్, నాగరాజు,ఇర్సవడ్ల ప్రశాంత్,ముమ్మానేని రమేష్,ముతేష్,జాడి రమేష్ తదితరులు పాల్గొన్నారు

## భారీ వర్షానికి తెగిపోయిన 163 జాతీయ రహదారి చతిస్గడ్ రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం రాకపోకలు

## బంద్ నిలిచిపోయిన 25 గ్రామాల రాకపోకలు



**ములుగు జిల్లా... ప్రజాబలం ప్రతినిధి జులై 21 వాజేడు**వాజేడు మండలంలోరాత్రి కురిసిన భారీ వర్షానికి కొట్టుకొని పోయిన అప్రోచ్ రోడ్డు.. ములుగు జిల్లా వాజేడు మండలంలోని జగన్నాధపురం నుండి తెలంగాణ ఛత్తీస్గడ్ సరిహద్దు లోటపెటగంటి వరకు వేస్తున్న నేషనల్ హైవే రోడ్లులో భాగంగా మండలంలోని పెద్ద గొల్లగూడెం వద్ద బ్రిడ్జి కోసం వేసిన అప్రోచ్ రోడ్డు రాత్రి కురిసిన భారీ వర్షానికి కొట్టుకొని పోయింది..

దీనితో వాజేడు మండలంలోని 25 గ్రామాలతో పాటు ,చతిస్గడ్ రాష్ట్రానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయినాయి..

అత్యవసర పరిస్థితులకు వెళ్లేవారు, విద్యార్థులు రైతు కూలీలు, ఇబ్బంది పడుతున్నారు అధికారులు స్పందించి వెంటనే అప్రోచ్ రోడ్ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు

## పట్లూర్ హరితహారం కార్యక్రమంలో గ్రామ

## సర్పంచ్ పరశురాం మరియు ఎంపీడీవో, ఏపీవో



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 21 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలో హరితహారం కార్యక్రమం మరియు ఇంటింటి ఇంకుడు గుంత తప్పనిసరి అని ఎంపీడీవో శాంతమ్మ ,ఏపీవో అంజిరెడ్డి, గ్రామ సర్పంచ్ పరశురాం తెలిపారు తొలకరి వర్షాలు ప్రారంభమైనవి కాబట్టి చెట్లు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం జరగాలని మర్పల్లి ఎంపీడీవో ఏపీవో తెలిపారు గ్రామంలో పరిసరాలు పరిశుభ్రత తడి చెత్త పొడి చెత్త వీధిలైట్లు మంచినీటి సౌకర్యం టూ పీస్ మోటార్స్ సిసి రోడ్లు అండ్ డ్రైనేజ్ ప్లానింగ్ ఇలా గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ పరుశురాం తెలిపారు కార్యక్రమంలో మర్పల్లి మండల అధికారి ఎంపీడీవో శాంతమ్మ, ఏపీవో అంజిరెడ్డి, గ్రామ సర్పంచ్ పరుశురాం, ఉప సర్పంచ్ అఖిల్, వార్డు నెంబర్లు గ్రామ సెక్రెటరీ గోపాల్, ఉపాధి హామీ కూలీలు గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు



Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com